RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 276 శుక్రవారం 31 అక్టోబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00

## భారత్‌పై 15 లక్షల సైబర్ అటాక్స్ చేసిన పాక్..

భారత్‌ను దెబ్బ తీయడానికి పాక్ అన్ని రకాలుగా కుట్రలు చేస్తూనే ఉంది. ఓ వైపు పాకిస్తాన్ ఆర్మీ కాల్పుల విరమణకు తూట్లు పొడుస్తూ .. సరిహద్దుల వెంబడి కాల్పులకు తెగబడుతూ ఉంది. మరో వైపు పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు అమయాక భారతీయుల్ని పొట్టనపెట్టుకుంటూ ఉన్నారు. ఈ రెండు రకాలుగానే కాకుండా .. మూడో రకంగా కూడా భారత్‌ను దెబ్బ తీయడానికి పాక్ కుట్రలు చేస్తూనే ఉంది. ఎవ్వరూ ఊహించని విధంగా భారీ స్థాయిలో సైబర్ అటాక్స్‌కు పాల్పడుతోంది. పహల్గామ్ టెర్రర్ అటాక్ తర్వాత పాకిస్తాన్‌కు చెందిన హ్యాకర్లు దేశ వ్యాప్తంగా 15 లక్షల సైబర్ అటాక్స్ జరిపినట్లు తేలింది.

# మొంథా ప్రభావం...

# 'శరవేగంగా సహాయక చర్యలు'




## వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లను ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని తెలిపారు. దీనిపై ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇది వరి కోతల కాలం.. కానీ అనుకోని ఉపద్రవం రైతులకు ఆవేదన మిగులుస్తోందన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అధికారుల అందరి సెలవులు రద్దు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూడాలని కలెక్టర్లకు ఆదేశించారు. ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్లపై బ్రిడ్జిలు, లోలెవల్ కాజ్‌వేల వద్ద వరద నీరు నిలిచినా, రోడ్లు దెబ్బతిన్నా.. ట్రాఫిక్‌ను డైవర్ట్ చేయాలని అధికారులకు సీఎం రేవంత్ సూచించారు. అవసరమైతే తప్ప ప్రజలు రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైనచోట అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వరంగల్‌లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అవసరమైన చోట హైడ్రా సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. 24 గంటలు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. అధికారులతో సమన్వయం చేసుకుని ఉమ్మడి జిల్లాల మంత్రులు, కలెక్టర్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అలాగే.. కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సంబంధింత జిల్లా ఇంచార్జ్ మంత్రికి తెలియజేయాలని పేర్కొన్నారు. కాలువలు, వాగులు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజలను అప్రమత్తం చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ప్రాజెక్టుల ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వివరించారు. ప్రాణనష్టం, పశు నష్టం, పంట నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఏ ఒక్కరి ప్రాణాలకు నష్టం జరగడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇవాల్టి వరంగల్ ఆకస్మిక పర్యటన వాయిదా వేసుకున్నట్లు రేవంత్ వెల్లడించారు. కాగా, రేపు (శుక్రవారం) వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అధికారులు బాధితులను ఆదుకునే ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా అప్రమత్తతతో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని చెప్పారు.

ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లకుండా సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈరోజు తలపెట్టిన వరంగల్ జిల్లా పర్యటనను వాయిదా వేసుకున్న ముఖ్యమంత్రి గారు గురువారం రోజున వరంగల్, హుస్నాబాద్ తదితర ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు.

# అజారుద్దీన్ కు మంత్రి పదవి వేళ బిగ్ ట్విస్ట్




## దక్కేనా, ఆగేనా..!?

హైదరాబాద్ : అజారుద్దీన్ కు మంత్రి పదవి వేళ కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అజారుద్దీన్ రేపు (శనివారం) మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అకస్మికంగా తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు రాజకీయంగా సంచలనంగా మారుతోంది. ఇదే సమయంలో అజారుద్దీన్ మంత్రి కావటం పైన ఫిర్యాదులు మొదలయ్యాయి. దీంతో.. ఇప్పుడు అజారుద్దీన్ మంత్రి పదవి పైన కొత్త చర్చ మొదలైంది. మరి.. ఏం జరగనుంది.. అజారుద్దీన్ ను మంత్రి వర్గంలోకి తీసుకోవాలని సీఎం రేవంత్ నిర్ణయించారు. ఇందుకు రేపే ముహూర్తం గా ఫిక్స్ చేసారు. రాజ్ భవన్ లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇప్పటికే అజారుద్దీన్ కు ఇచ్చే మంత్రిత్వ శాఖ పైనా పార్టీలో చర్చ జరుగుతోంది. తొలుత మైనార్టీ సంక్షేమం తో పాటుగా క్రీడల శాఖ ఇస్తారని ప్రచారం సాగింది. అయితే, హోం శాఖ ఇవ్వనున్నట్లుగా తాజాగా పార్టీ నేతల సమాచారం. ఇంకా తుది నిర్ణయం జరగాల్సి ఉంది. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో మైనార్టీ ఓట్ బ్యాంక్ కీలకంగా మారుతోంది. ఈ సమయంలోనే అజారుద్దీన్ కు మంత్రిగా తీసుకోవటం ద్వారా రాజకీయంగా కలిసి వస్తుందని రేవంత్ అంచనా. రేవంత్ సైతం ప్రచారంలోకి వస్తున్నారు. అయితే, ఇదే సమయంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారానికి సిద్ధం అవుతున్న వేళ బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ మేరకు ఎన్నికల సంఘానికి బీజేపీ నేతలు ఫిర్యాదు చేశారు. గతంలో జూబ్లీహిల్స్‌లో కాంటెస్ట్ చేసిన అజారుద్దీన్‌కు ఈ సమయంలో మంత్రి పదవి ఇవ్వడం పై బీజేపీ అభ్యంతరం తెలిపింది. ప్రస్తుతం జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పోరులో ఒక వర్గం ఓట్లపై ప్రభావం చూపేలా ఉన్న మంత్రివర్గ విస్తరణను ఆపాలని ఈసీకి బీజేపీ నేతలు కోరారు. జూబ్లీ హిల్స్ పోలింగ్ అయ్యే వరకు అజారుద్దీన్ కు మంత్రి పదవి వాయిదా వేసేలా చూడాలని ఈసీకి వినతి పత్రం సమర్పించారు. అజారుద్దీన్ కు ఇప్పుడు మంత్రి పదవి ఇవ్వడం ఒక వర్గం ఓటర్లను మభ్య పెట్టడమేనని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. అసలు అజారుద్దీన్ ఎమ్మెల్సీ పదవినే ఊగిసలాట లో ఉందని వ్యాఖ్యానించారు. దీంతో.. ఇప్పుడు ఈ వ్యవహారంలో ఈసీ జోక్యం చేసుకుంటుందా.. ఎన్నికల కోడ్ ఏం చెబుతోంది... తుది నిర్ణయం ఏంటనేది ఉత్కంఠగా మారుతోంది.




## కేంద్ర సహకారంతో రైతులను ఆదుకుంటాం: మంత్రి పొన్నం

సిద్దిపేట, అక్టోబర్ 30: సిద్దిపేట జిల్లా కోహెడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ ఈరోజు (గురువారం) పర్యటించారు. పోరెడ్డిపల్లి గ్రామంలో భారీ వర్షం కారణంగా జరిగిన పంట నష్టాన్ని పరిశీలించారు. వరదలతో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. పంట నష్టంతో ఆవేదన చెందుతున్న రైతులతో మాట్లాడారు. అనంతరం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలో ఉందని.. పూర్తిగా జలమయం అయిందని తెలిపారు. రైతాంగం పూర్తిగా నష్టపోయిందన్నారు. వేలాది ఎకరాల్లో ధాన్యం దెబ్బతిన్నదని.. కొట్టుకుపోయిందని అన్నారు. వర్షాలకు రోడ్లు మొత్తం దెబ్బతిన్నాయని చెప్పారు. ఇప్పుడే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారని.. హుస్నాబాద్‌లో పర్యటించాలని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశామన్నారు.

రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం హామీ ఇస్తుందని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయాలకు అతీతంగా రైతాంగాన్ని ఆదుకోవాలని.. ఇక్కడ పర్యటించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారం తీసుకొని బాధ్యతగా రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వరదలు వచ్చినప్పుడు అధికారులు ప్రజల మధ్యే ఉండి నష్టపోయిన పంటలను అంచనా వేయాలని, భారీ వరదలకు జరిగిన నష్టాన్ని మొత్తం రికార్డ్ చేయాలని అధికారులను ఆదేశించామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.




# జూబ్లీహిల్స్‌లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే!

## నవీన్ యాదవ్ గెలుపు నల్లేరు మీద నడకే..

## మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో అంతిమ విజయం కాంగ్రెస్ పార్టీదేనని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖా మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అన్నీ సర్వేలు హస్తం వైపే వెలువడడమే ఇందుకు తార్కాణమని ఆయన పేర్కొన్నారు. ఇక్కడి నుండి బరిలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు నల్లేరు మీద నడకేనని ఆయన తేల్చిచెప్పారు. జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఉదయం నియోజకవర్గ పరిధిలోని యూసుఫ్ గూడ డివిజన్ కృష్ణానగర్ లో సహచర మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ శాసనసభ్యులు ఇదూలపల్లి శంకరయ్య, కాంగ్రెస్ పార్టీ నేత అజహరోద్దిన్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, ఎస్.టి కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఏ.ఐ. సి.సి కార్యదర్శి సంపత్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత ముదిరాజ్, బొల్లు కిషన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ%ౌ% పదేళ్ల బి.ఆర్.ఎస్ పాలనలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని నిరుపేదలు నిర్లక్ష్యానికి గురయ్యారని విమర్శించారు. బి.ఆర్.ఎస్ పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజులు ఒక్కటంటే ఒక్క తెల్ల రేషన్ కార్డు మంజూరు చేయలేక పోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. కేవలం 20 నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన నిరుపేదలకు 89 లక్షల నుండి కోటి 15 లక్షలకు తెల్ల రేషన్ కార్డులు పెంచామన్నారు. ఇంత పెద్ద ఎత్తున నిరుపేదలకు తెల్ల రేషన్ కార్డులను మంజూరు చేసిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఒక్క జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని నిరుపేదలకే 40 వేల తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేశామని ఆయన గుర్తు చేశారు. యావత్ భారత దేశ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా నిరుపేదలందరికి నాణ్యమైన సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని ఆయన కొనియాడారు. రాష్ట్ర జనాభాలోని 85 శాతం మంది ఎస్.సి,ఎస్.టి, బి.సి, మైనారిటీ ప్రజలకు సన్న బియ్యం అందించిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పై ప్రజలలో రోజు రోజుకు విశ్వసనీయత పెరుగుతుందని ఆయన చెప్పారు. నాణ్యమైన సన్న బియ్యంతో 3 కోట్ల 15 లక్షల మంది లబ్ది పొందుతుండగా మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలు ఉచిత బస్సు ప్రయాణంతో ప్రయోజనం పొందుతున్నారన్నారు. అంతే గాకుండా గృహ జ్యోతి పథకంతో అర్హులైన నిరుపేదలందరికి 200 యూనిట్ల విద్యుత్ ను ఉచితంగా అందిస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అటువంటి సంక్షేమ పథకాలను విస్మరించిన విపక్షాలు అధికార కాంగ్రెస్ ప్రభుత్వం పై దుష్ప్రచారానికి పాల్పడడం విడ్డురంగా ఉందని ఆయన విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కల నేతృత్వంలోనీ రాష్ట్ర ప్రజలకు సంపూర్ణమైన నమ్మకం కుదిరిందని, ఆ నమ్మకంతోటే ఇక్కడి ప్రజలు జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టబోతున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర రోడ్డు రవాణా,బి.సి సంక్షేమ శాఖామంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ%ౌ% జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బి.జె.పి,బి.ఆర్.ఎస్ లు ఒక్కటయ్యారని ఆరోపించారు. ఆ రెండు పార్టీల కుట్రలను ఛేదించాడానికి ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. ఇదే నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహిస్తూ కేంద్ర మంత్రిగా విధులు నిర్వర్తిస్తున్న కిషన్ రెడ్డి జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఎన్ని నిధులు విడుదల చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ సూటిగా ప్రశ్నించారు.

# సంపాదకీయం

## 'కరూర్' కేసులో విజయ్ పేరు లేకపోవడం వెనుక ఆంతర్యం ఏంటి..?

సెప్టెంబర్ 27, 2025న తమిళనాడు రాజకీయాల్లో ఈ తేదీ అత్యంత దుర్దినంను చూపుతోంది. ఆ రోజు 41 మంది ప్రాణాలు కోల్పోగా.. వందకు పైగా మంది తీవ్రగాయాలపాలయ్యారు. అందులో కొందరు శాశ్వత అనారోగ్యం పాలయ్యారు. తమిళనాడు కరూర్‌లో దళపతి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ మొదటి పబ్లిక్ రోడ్‌షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట దారుణం. మరణించిన, గాయపడిన వారిలో ఎక్కువ మంది మహిళలు, పిల్లలు. ఈ ఘటన తమిళనాడు రాజకీయాల్లో తుఫాను సృష్టించింది. దీనిపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అసెంబ్లీలో 'విజయ్ ఆలస్యంగా రావడం, భారీ జన సమీకరణతో ఈ దుర్ఘటన జరిగింది' అని అన్నారు. పోలీసులు సీరియస్ గా కేసును దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. పోలీసులు దర్యాప్తు చేస్తుండగా.. తనపై కుట్ర జరుగుతోందని విజయ్ సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. దీంతో సుప్రీం సీబీఐ విచారణకు ఆదేశించింది.

**సుప్రీం ఆదేశాలతో రంగంలోకి సీబీఐ...** సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సీబీఐ విచారణ ప్రారంభించడంతో, ప్రాథమిక ఎఫ్ఐఆర్‌లో విజయ్ పేరు లేకపోవడం చర్చనీయాంశమైంది. తమిళనాడు పోలీసులు నమోదు చేసిన కేసుల్లో కూడా అతని పేరు లేదు. ఈ పరిణామం రాజకీయ కుట్రలు, న్యాయ వ్యవస్థ మధ్య సంక్షోభాన్ని రేకెత్తిస్తోంది. విజయ్ పేరు మిస్సింగ్ కావడం బీజేపీ చేసిన పనేనని కొందరు ఆరోపిస్తున్నారు. ఆయనను రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని డీఎంకే నేతలు విమర్శలు కురిపిస్తున్నారు. ఇది తమిళనాడు రాజకీయాల్లో కొత్త చర్చలకు దారితీస్తోంది.

**దారుణమైన ఘటన..** కరూర్ ఘటన దారుణమైనది. విజయ్ టీవీకే పార్టీ పతాకాలతో మొదటి పబ్లిక్ రోడ్‌షో నిర్వహించిన సమయంలో అధిక రద్దీ, పోలీస్ బందోబస్తు మధ్య లోపాల వల్ల తొక్కిసలాట జరిగింది. సుప్రీంకోర్టు 'పొలిటికల్ అండర్‌టోన్' ఉందని గుర్తించి, సీబీఐకి కేసు అప్పగించింది. సీబీఐ ప్రాథమిక ఎఫ్ఐఆర్‌లో టీవీకే జనరల్ సెక్రటరీ బస్సీ ఆనంద్, మరో ముగ్గురు ఫంక్షనరీలను మాత్రమే నేమ్ చేసింది. విజయ్ పేరు లేకపోవడం, అతను సుప్రీం కోర్టు వెళ్లి విచారణ తెచ్చుకున్నప్పటికీ, ఇప్పుడు బీజేపీ ఆయనను రక్షిస్తుందని ఆరోపణలకు దారితీసింది. నామ్ తమిళర్ కచ్చి నేత సీమాన్, 'విజయ్ పేరు ఎందుకు లేదు? ఇది రాజకీయ కుట్ర' అని ప్రశ్నించారు. డీఎంకే పక్షం కూడా, 'విజయ్ బీజేపీతో దగ్గరి సంబంధాలు పెట్టుకొని సీబీఐని ఉపయోగిస్తున్నాడు' అని ఆరోపిస్తోంది. సీఎం స్టాలిన్ అసెంబ్లీలో విజయ్‌ను నేరారోపితుడిగా చూపించినా.. ఎఫ్ఐఆర్ లో పేరు లేకపోవడం ప్రభుత్వం రాజకీయ వ్యూహాన్ని సూచిస్తుందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

**బాధితులకు విజయ్ అండ..** విజయ్ ప్రతిస్పందన ఆసక్తికరంగా ఉంది. ప్రభుత్వాలు తనను నిందితుడిగా మార్చే కుట్రలు చేస్తున్నాయన్నాడు. మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున పరిహారం పంపి, 'భవిష్యత్తులో అండగా ఉంటాము' అని చెప్పాడు. 'విజయ్ సినిమాల నుంచి రాజకీయాల్లోకి వచ్చి, బీజేపీతో కుమ్మక్కై కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగిస్తున్నాడు' అని సీమాన్ వ్యాఖ్యానిస్తున్నారు. మద్రాస్ హైకోర్టు అక్టోబర్ 27కు కేసు విచారణ వేసింది. అయితే కొన్ని బాధిత కుటుంబాలు 'సీబీఐ పిటిషన్‌లో మిస్‌లెడ్ చేశారు' అని క్లెయిమ్ చేశాయి. ఇది విజయ్ పార్టీ ప్రచార వ్యూహాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది.

**మరింత స్వతంత్రంగా జరగాలి..** ఈ కేసు విషయంలో సీబీఐ విచారణ మరింత స్వతంత్రంగా జరగాలి. మద్రాస్ హైకోర్టు మానిటరింగ్ చేయాలి. విజయ్ పార్టీ ఈవెంట్లకు ముందు సెక్యూరిటీ ప్రోటోకాల్స్ అమలు చేయాలి. ప్రభుత్వం రాజకీయ కుట్రలు పక్కన పెట్టి బాధిత కుటుంబాలకు న్యాయం అందించాలి. కరూర్ కేసులో సీబీఐ ఎఫ్ఐఆర్‌లో విజయ్ పేరు మిస్సింగ్, రాజకీయ కుట్రలకు దారితీస్తోంది. విజయ్ రాజకీయ ప్రయాణం మొదటి దశలోనే ఈ దుర్ఘటన అతని నాయకత్వ లోపాన్ని సూచిస్తుంది.

# పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకే ఇందిరమ్మ ఇళ్ళు.... వజ్రేష్ యాదవ్





శామీర్ పేట, అక్టోబరు 30 ( గరుడ వార్త ): నిరుపేదలను ఆదుకొనేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఇందిరమ్మ పథకంతోఇండ్లను నిర్మిస్తోందని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ వజ్రేష్ యాదవ్ అన్నారు. శామీర్ పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని తుర్కపల్లిలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలను మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలుయాదవ్, హౌసింగ్ డీఈ అశోక్, అలియాబాద్ మున్సిపల్ కమీషనర్ చంద్రశేఖర్ లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ గ్రామాల్లోని పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ పథకం కింద ఇళ్ళను నిర్మించుకొనేందుకు రూ. 5 లక్షలను విడుతల వారిగా అందిస్తుందని తెలిపారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, నీరు పేదల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినూత్నంగా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఏబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేశ్, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి భిక్షపతి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఊరడి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

## బాధితులు స్వీకరించిన మూడు చింతలపల్లి నూతన తహసిల్దార్



శామీర్ పేట, అక్టోబర్ 30( గరుడ వార్త ): మూడు చింతల పల్లి తహసీల్దార్ గా సుచరిత బాధ్యతలు స్వీకరించారు. గురువారం మూడు చింతల పల్లి నూతన తహసీల్దార్ గా సుచరిత బాధ్యతలను స్వీకరించిన తాసిల్దార్ ను లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన యువ నాయకుడు క్యాతం మధు క్రిష్ణ, నాయకులు శ్రీనివాస్ చారి, భాస్కర్ లు తహసిల్దార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించారు. గురువారం మూడుచింతల పల్లి నూతన తహసీల్దార్ గా సుచరిత బాధ్యతలను చేపట్టారు. లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన యువ నాయకుడు క్యాతం మధు క్రిష్ణ, నాయకులు శ్రీనివాస్ చారి, భాస్కర్ లు తహసిల్దార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## సిరిసిల్ల నుండి మొదలైన అయ్యప్ప స్వాములు మహా పాదయాత్ర షామీర్పేట చేరుకుంది...



శామీర్ పేట, అక్టోబర్ 30 ( గరుడ వార్త) : భక్తిశ్రద్ధలతో కొనసాగు తున్న అయ్యప్ప స్వాముల మహా పాదయాత్ర శామీర్ పేట కు చేరుకుంది. సిరిసిల్ల నుంచి శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప స్వాముల మహా పాదయాత్ర శామీర్ పేట కు చేరుకుంది. గురువారం శామీర్ పేట శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద స్వాములు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విశ్రాంతి తీసుకుని తిరిగి వెళ్లారు. రాచ విద్యాసాగర్ గురు స్వామి ఆశీర్వాదంతో మధుసూదన్, రాజేందర్ గౌడ్ గురుస్వా ముల ఆధ్వర్యంలో 40 మంది అయ్యప్ప మాల ధారణ స్వాములు శబరిమలకు వెళ్తున్నారు. సిరిసిల్లలోని శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానం నుంచి ఈనెల 26న ఉదయం ఈ యాత్ర ప్రారంభించినట్లు స్వాములు తెలిపారు. కాణిపాకం, అరుణాచలం, శ్రీరంగం, సమయపుర, జంభుకేశ్వర్, పాతాళ శంభు మురుగన్ క్షేత్రాలను దర్శించుకుంటూ 48 రోజులపాటు 1300 కిలోమీటర్లు ఈ మహా పాదయాత్ర సంకల్పించినట్లు చెప్పారు.

## కూలిన వీరబ్రహ్మేంద్రస్వామి ఇల్లును పునర్దించాలి

### ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే నిర్మాణం చేపట్టాలి : బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి..

హైదరాబాద్ : తుఫాను ప్రభావంతో కడపలోని బ్రహ్మంగారి మఠం లోని వీరబ్రహ్మేంద్రస్వామి పురాతన నివాసం కూలిపోవడం జరిగిందని వెంటనే పునః నిర్మించాలని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి డిమాండ్ చేశారు. బ్రహ్మంగారి ఇల్లు సాంస్కృతిక సంపద అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తక్షణమే పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు విషయం తెలుసుకున్న కుందారం గణేష్ చారి తెలంగాణ విశ్వబ్రాహ్మణు లతో కలిసి కడప జిల్లాకు వెళ్లి కూలిన బ్రహ్మంగారి ఇంటిని పరిశీలించారు. అనంతరం భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా తక్షణమే ఇంటిని నిర్మాణం చేసి అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ చారి మాట్లాడుతూ భూత భవిష్యత్తు వర్తమానం గురించి 400 సంవత్సరాల క్రితమే సమాజానికి బోధించిన మహనీయుడు పోతులూరి వీరబ్ర హ్మేంద్రస్వామి అని అన్నారు. అలాంటి మహనీయులు ప్రపంచంలో ఇప్పటివరకు భవిష్యత్తులో జరిగేది జరగబోయే దాని గురించి తెలియజేసింది బ్రహ్మంగారు ఒక్కరేనని తెలిపారు. కడప జిల్లాలోని బ్రహ్మంగారి ఇంటికి ఎంతో చరిత్ర ఉందని తుఫాను ప్రభావంతో స్తంభాలు కృంగి ఇల్లు పడిపోవడం బాధాకరమన్నారు. భక్తులు మనోవేదనకు గురవుతున్నారని



తక్షణమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి అతి తొందరగా నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా చారిత్రకమైన నివాసాన్ని దైవ క్షేత్రం గా గుర్తించి పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బ్రహ్మాచారి, అక్కినపల్లి శ్రీనివాస్ చారి, ముత్తోజు మధు తదితరులు ఉన్నారు.

## జూబ్లీహిల్స్ లో బిజెపి గెలుపు ఖాయం

### బిజెపి సీనియర్ నాయకులు అంబాల రాజేశ్వరరావు..

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి లంక దీపక్ రెడ్డి గెలవడం ఖాయమని బిజెపి సీనియర్ నాయకులు అంబాల రాజేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. బిజెపి అభ్యర్థికి మద్దతుగా అంబాల రాజేశ్వర తన అనుచరులతో కలిసి జూబ్లీహిల్స్ లోని వివిధ డివిజన్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి షాప్ షాప్ కు వెళ్లి కమలం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. దేశంలో నరేంద్ర మోడీ తీసుకుంటున్న సాహసోపేతమైన నిర్ణయాలు అభివృద్ధి సంక్షేమ పథకాలు తదితర విషయాలను ఓటర్లకు వివరించి బిజెపికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అంబాల రాజేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బిజెపి కి మంచి ఆదరణ ఉందని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిజెపి గెలవడం ఖాయమన్నారు. దేశ ప్రజలే తన కుటుంబం అనుకొని ప్రధాని నరేంద్ర మోడీ పాలన కొనసాగిస్తూ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నారని తెలిపారు. దేశం వైపు ప్రపంచం చూసే విధంగా చేశారని కొనియాడారు. ప్రపంచ దేశాల్లో ఎక్కడికి వెళ్లినా మోడీ ఇండియా.. మోడీ ఇండియా.. అని నినాదాలు చేయడం సంతోషకరమన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బిజెపి పార్టీకి ఓటు వేసి లంక దీపక్ రెడ్డి ని గెలిపించుకొని ప్రధాని నరేంద్ర మోడీకి కానుకగా పంపిద్దామని కోరారు. అలానే గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి చెందాలంటే రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కనకట్ల హరి, ఆకారం రమేష్, గణేష్ తో పాటు బిజెపి నాయకులు కార్యకర్తలు శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## గుత్తేదారులు వదిలేశారు!

భువనగిరి: ప్రభుత్వం పనులు మంజూరు చేస్తోంది. గుత్తేదారులు ఒప్పందం చేసుకుంటున్నారు.. మంత్రులు, ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు పనులు మధ్యలో వదిలేసి వెళ్లిపోతున్నారు. కొత్త పనులు చేయకుండా ఆపేస్తున్నారు. జిల్లాలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల తీరు ఇలా.. ప్రణాళికేతర నిధులతో రెండేళ్ల కిందట భువనగిరి మండలంలో మూడు రహదారుల బీటీ రెన్యూవల్ ప్రతిపాదించారు. టెండర్ల క్రతువు ముగిసి గుత్తేదారు ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. ఇప్పటి వరకు ఏ ఒక్క పనికూడా ప్రారంభించలేదు. వీటిలో అనాజీపూర్ నుంచి జంపల్లి వరకు 5 కి.మీ.లకు రూ.కోటి, భువనగిరి అప్రోచ్‌రోడ్డు–ముత్తిరెడ్డిగూడెం–దాతర్‌పల్లి వరకు 10 కిమీలకు రూ.2 కోట్లు, ముత్తిరెడ్డిగూడెం– గంగసానిపల్లి– పాత గుట్ట వరకు 4.6 కిమీ సుమారు రూ.కోటి మంజూరు చేశారు.

బీబీనగర్–పోచంపల్లి మార్గంలో మూసీ నదిపై రుద్రవెల్లి–జూలూరు మధ్యన వంతెన పనులు ప్రారంభించి ఏడేళ్లు కావొస్తుంది. నాబార్డు ఆరేళ్ల కింద రూ. 8.5 కోట్లతో మంజూరు చేసింది. కరోనా నేపథ్యంలో మరో ఏడాది గడువు పొడిగించారు. ఆ లోపు నాబార్డు గడువు ముగియడంతో చేసిన పనుల వరకు బిల్లులు చెల్లించి పనులు నిలిపివేశారు. అసంపూర్తి పనులు చేపట్టేందుకు విడిగా కొత్త అంచనాలు తయారు చేసి పంపగా 2022–23లో ఎస్సీ ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ. 10.80 కోట్లు మంజూరు చేశారు. కాకతీయ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఈ పనులు పొందింది. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపి వేశారు. చౌటుప్పల్ మండలంలో 2023లో ఏడు రోడ్ల నిర్మాణానికి సీఆర్ఆర్ నిధులు మంజూరయ్యాయి. రోడ్ల నిర్మాణం కాలేదు. ప్రస్తుతం ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఈ రోడ్ల విస్తరణ 3.7 మీటర్ల నుంచి 5.5 మీటర్లకు పెంచేందుకు ప్రతిపాదించి అదనపు



నిధులు మంజూరు చేయించారు. పనులు పూర్తయితే రోడ్డు సౌకర్యం ఏర్పడుతుంది.

**పాత పనుల రద్దుకు సిఫార్సు**

– సుగంధర్, డీఈ, ఆర్‌అండ్‌బీ, భువనగిరి డివిజన్

గుత్తేదారులు ఒప్పందం చేసుకుని ఇంత వరకు ప్రారంభించని పనులు రద్దు చేయాలని (డీ–సాంక్షన్) కోరుతూ ఇటీవల ప్రభుత్వానికి రాశాం. ఇటీవల మంజూరైన పనులు ప్రారంభించేలా గుత్తేదారులపై ఒత్తిడి తెస్తున్నాం. బిల్లులు కాకపోవడంతో గుత్తేదారులు పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. అయినా వారిని ఒప్పించి పనులు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.రాయగిరి నుంచి మోత్కూరుకు వెళ్లే ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా 2021–22లో ప్రభుత్వం రూ. 5.80 కోట్లు మంజూరు చేసింది. మోత్కూరు నుంచి కప్రాయిపల్లి వరకు 3.40 కి.మీ. చేపట్టిన పనులు నేటికీ అసంపూర్తిగా మిగిలాయి. రోడ్డు అధ్వానంగా తయారైంది.ఆత్మకూరు మండలంలో రాయగిరి–మోత్కూరు రెండు వరసల ప్రధాన రహదారికి దశలవారీగా మరమ్మతులు నిర్వహిస్తున్నారు. గుత్తేదారు ఏడాది క్రితం తుక్కాపురం స్టేజీ నుంచి బునాదిగాని కాల్వ కల్వర్టు వరకు రహదారి తారును తొలగించి కంకర పరిచి పనులు వదిలేశారు.

## శంకుస్థాపనకు చురుగ్గా ఏర్పాట్లు

భువనగిరి: భువనగిరిలో జిల్లా కోర్టుల సముదాయం శంకుస్థాపనకు వడివడిగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పట్టణ శివారులోని మాసుకుంట వద్ద సర్వే నెంబర్ 742లో 10 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ప్రస్తుతం భువనగిరి పట్టణంలోని పాత భవనంలో జిల్లా కోర్టులు కొనసాగుతున్నాయి. కొత్తగా కోర్టు రావడంతో వాటికి తగినట్లుగా నూతన భవనాలు నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. రూ.81 కోట్లు మంజూరు చేశారు. 12 జిల్లాలకు కలిపి ఒకేసారి టెండర్లు పిలిచారు. జిల్లాల వారీగా గుత్తేదారులతో ఒప్పందాలు కూడా జరిగాయి. నిర్మాణ పనులకు శంకుస్థాపన జరగాల్సి ఉంది. తేదీ ఎప్పుడు ఖరారు అయినా శంకుస్థాపనకు సన్నాహాల్లో భాగంగా పైన 500 మందికి పైగా కూర్చునే విధంగా స్థలాన్ని సిద్ధం చేశారు. రోడ్లు భవనాల శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

స్థలంలో గుట్టలు ఉండటంతో లెవలింగ్ పనులు చేపట్టారు. నేల నుంచి 50 మీటర్ల ఎత్తులో ఉండటంతో భవన నిర్మాణాల కోసం లెవల్స్ తీసి హద్దులు నిర్ణయించారు. స్థలం మధ్యన, నాలువైపులా ప్రత్యేక బోర్లు వేసి మట్టి నమూనాలు తీసి పరీక్షలకు పంపారు. నివేదికల మేరకు ఆకృతులు ప్రతిపాదించి నిర్మాణాలను చేపడుతున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈఈ సైదులు తెలిపారు. మూడు రోజుల క్రితం ఒక బోరు బావి వేశారు. సమృద్ధిగా నీళ్లు పడ్డాయి. అక్టోబరు రెండో వారంలో శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



10 ఎకరాల స్థలం కేటాయించగా.. రెండు ఎకరాల విస్తీర్ణంలో భవనాల నిర్మాణం చేపట్టనున్నారు. జి ప్లస్ 3 అంతస్థుల్లో నిర్మిస్తున్నారు. స్టిల్ట్ పార్కింగ్ కోసం ఒక్కో అంతస్థు 46 వేల చ.అడుగుల్లో నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదించారు. మొత్తం 12 కోర్టు హాళ్లు, మహిళా, పురుష న్యాయవాదులకు విడివిడిగా నిరీక్షణ భవనాలు, ఆయా కోర్టులకు విడివిడిగా కార్యాలయాలు, స్టోర్, రికార్డుల గదుల నిర్మాణానికి ప్రతిపాదించారు. భవిష్యత్‌లో న్యాయమూర్తుల భవన సముదాయాల నిర్మాణానికి స్థలాన్ని కేటాయించారు. హాళ్ల చుట్టూ గోడ నిర్మించనున్నారు. గుట్టపైకి రహదారులు, అంతర్గత సీసీ రోడ్లు ఏర్పాటు చేయనున్నారు. స్థలంలో చెట్లు ఉండటంతో అటవీశాఖ నుంచి అనుమతులు తీసుకున్నారు. పైకి కచ్చా రహదారులు ఏర్పాటు చేస్తున్నారు.

## విద్యుత్తుతో పరుగులు.. కాలుష్య నియంత్రణకు అడుగులు

హైదరాబాద్: విద్యుత్తుతో నడిచే మెట్రోరైలు కిలోమీటర్ దూరానికి 10 యూనిట్లు మాత్రమే వినియోగిస్తుంది. ఎల్బీనగర్ నుంచి మియాపూర్ 29 కిలోమీటర్ల మార్గంలో ఒక ట్రిప్ దూరానికి 290 యూనిట్ల విద్యుత్తుతో.. ఏకంగా వెయ్యి మందిని గమ్యస్థానానికి చేర్చవచ్చు. ఆ విధంగా ఇంధన పొదుపులో హైదరాబాద్ మెట్రో ఇతర రవాణా సాధానాలతో పోలిస్తే కాలుష్య నివారణలో కీలకంగా మారింది. నగర కాలుష్యంలో 70 శాతం వాహనాల నుంచి వెలువడుతోంది. మెట్రోరైలును అన్ని ప్రాంతాలకు విస్తరణతో వాహన కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించేందుకు అవకాశం ఉందని రవాణారంగ నిపుణులు చెబుతున్నారు.

గత ఆర్థిక సంవత్సరంలో... 2024–25 ఆర్థిక సంవత్సరంలో 38 మిలియన్ లీటర్ల ఇంధనాన్ని ఆదా చేసింది. సుమారు 109 మిలియన్ కిలోల కార్బన్ డై యాక్సైడ్‌ను నిలువరించింది.

45 మిలియన్ యూనిట్ల వరకు..ఇప్పుడున్న 69 కి.మీ. మెట్రో మార్గంలో రోజూ 1100 ట్రిప్పులు తిరుగుతున్నాయి. ఐదు లక్షల



మందిని రోజూ గమ్యస్థానం చేరుస్తోంది. సగటున 25వేల కిలోమీటర్లు మెట్రోరైలు నిత్యం నడుస్తోంది. ఇందుకు 2.5 లక్షల యూనిట్ల విద్యుత్తు వినియోగిస్తోంది.

**40 శాతం ఆదా ఇలా..**

రైలు బ్రేక్ వేసినప్పుడు 40 శాతం వరకు ఉత్పత్తి అయ్యే విద్యుత్తును తిరిగి వినియోగించుకునే వ్యవస్థతో గణనీయంగా ఇంధనం ఆదా అవుతోంది. 45 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఈ విధానంలో ఆదా చేసింది.

పలకల ఏర్పాటు..

మెట్రోరైలు 2 డిపోలు, 41 స్టేషన్లపై సౌర విద్యుత్తు పలకలు ఏర్పాటు చేశారు. వీటి మొత్తం సామర్థ్యం 11 మెగావాట్ల వరకు ఉంది. మెట్రోరైలు విద్యుత్తు అవసరాల్లో 12 శాతం సౌర విద్యుత్తు సమకూరుస్తోంది.

## బండి రాదని.. బండబాదుడు..!

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో గ్యాస్ అయిపోయింది. వెంటనే బుక్ చేసుకుని రోజంతా ఎదురు చూశారు. డెలివరీ బాయ్‌కు ఫోన్ చేయగా..తను సెలవులో ఉన్నానని చెప్పాడు. ఏజెన్సీ నిర్వాహకులకు ఫోన్ చేయగా..ఒక రోజు ఆగాలని, లేదంటే బయట దుకాణాల వద్ద కొనుగోలు చేసుకోవాలని ఆయనే అడ్రస్ చెప్పడం గమనార్హం. దీంతో విధిలేక ఆ ఉద్యోగి రూ.1100 చెల్లించి బయట కొనుగోలు చేసుకోవాల్సి వచ్చింది.

నిత్యావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లు జిల్లాలో పక్కదారి పడుతున్నాయి. బుక్ చేసుకున్న వారి ఇళ్లకు ప్రతి రోజు సరఫరా చేయాల్సిన కొందరు డెలివరీ బాయ్స్ ఏజెన్సీ నిర్వాహకులతో కుమ్మక్కై బయటి వ్యక్తుల ద్వారా విక్రయాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. పట్టణ ప్రాంతాల్లోని గ్యాస్ పొయ్యి మరమ్మతులు, వాటి వస్తువులు విక్రయించే కొన్ని దుకాణాలను అడ్డాగా చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యవహారం నడిపిస్తున్నారు. గ్యాస్ బండను రూ.926.50 విక్రయించాల్సి ఉంది. ప్రభుత్వ రాయితీ రూ.46 బ్యాంకు ఖాతాలో జమ అవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద రూ.500లను జమ చేస్తోంది.

కొందరు డెలివరీ బాయ్స్ పలువురు ప్రైవేటు వ్యాపారులకు గ్యాస్ ధర కన్నా రూ.50 అధికంగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదే అదునుగా భావించిన ఆ వ్యాపారులు మరో రూ.100 కలిపి మొత్తం రూ.1100 విక్రయిస్తున్నారు. బుక్ చేసుకున్న వారికి సకాలంలో సిలిండర్ అందించకుండా ఇలా పక్కదారి పట్టిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వారు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. మరికొందరు డెలివరీ బాయ్స్ వినియోగదారులకు సరఫరా చేసినా అదనంగా రూ.30 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

డెలివరీ బాయ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏజెన్సీ నిర్వాహకులకు ఇప్పటికే సూచించాం. బుక్ చేసుకున్న వారికి ఎప్పటికప్పుడు సరఫరా చేయాలి. గ్యాస్‌ను అందించకుండా ఇబ్బందులకు గురి చేసినా, అదనంగా డబ్బులు వసూలు చేసినా సంబంధిత బాధితులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయండి. వెంటనే సదరు ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.మోహన్‌బాబు, డీఎస్‌వో, సూర్యాపేట


## వాహన'దారి'కి కష్టం..!

హాలియా : మంత్రి వర్యా.. నేను హాలియా పట్టణం దేవరకొండ రోడ్డులోని నాగార్జునసాగర్ ఎడమ కాల్వపై ఆరు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనను..ఐదేళ్ల క్రితం కోదాడ–జడ్చర్ల 167 జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా జాతీయ రహదారిపై వాహనాలు రాకపోకలు సాగించడానికి అనువుగా హాలియా వద్ద ఎడమ కాల్వపై వంతెన విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. 60 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పుతో నా (వంతెన) విస్తరణ పనుల కోసం రూ.156 లక్షల నిధులు కేటాయించారని అధికారులు చెబుతున్నారు. ఐనప్పటికీ నేడు.. రేపు అని చెబుతూ అధికారులు, గుత్తేదారు విస్తరణ పనులు చేపట్టడం లేదు.ప్రస్తుతం నా పరిస్థితి ఇరుకుగా, రోడ్డుపై గుంతలు పడి చివరి భాగంలో కుంగిపోతున్నాను. జాతీయ రహదారి కావడంతో ఈ మార్గం గుండా హైదరాబాద్ నుంచి కర్నూలు నుంచి విజయవాడ, గుంటూరుకు ఇతర రాష్ట్రాలకు ప్రతి రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. నా సమీపంలో పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ కార్యాలయాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలు ఉన్నాయి. ప్రతి రోజు వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు ఈ వంతెన గుండా రాకపోకలు సాగిస్తుంటారు.

ఎడమ కాల్వ ప్రవాహం ఉద్ధృతి అధికంగా ఉండటం, ఇరుకైన వంతెనపై నిత్యం వాహనాల ట్రాఫిక్ మధ్య విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు రాకపోకలు సాగించేందుకు భయాందోళన చెందుతున్నారు. పర్వదినాల్లో, ఎన్నికల సమయంలో రాజకీయ సభలు జరిగినప్పుడు ఇరుకైన వంతెనపై ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, స్థానికులు పడుతున్న ఇబ్బందులు నన్ను బాధిస్తున్నాయి.

గత నెల రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నాపై ఒక భాగం చివరలో పూర్తిగా కుంగిపోయింది. అధికారులు కుంగిపోయిన ప్రాంతంలో ఇప్పటికి నాలుగు పర్యాయాలు పూడ్చే ప్రక్రియ చేపట్టినా లాభం లేకుండా పోతుంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా మీరు మంత్రిగా.. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి ఈ ప్రాంతానికి చెందిన వారే కావడం వల్ల వెంటనే విస్తరణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటారని నేను ఆశాభావం వ్యక్తం చేస్తున్నాను.ఇట్లు .. ఆరు దశాబ్దాల శిథిల వంతెన

# కొత్త కోర్సులతోనే ప్రయోజనం



వికారాబాద్ : జిల్లాలోని ఒకే ఒక్క ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అవసరమైన కొత్త కోర్సుల్లేక విద్యార్థులు నష్టపోతున్నారు. వికారాబాద్‌కు 2008లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేశారు. 17 ఏళ్ల కిందట ఏ కోర్సులున్నాయో ఇప్పటికే అవే కొనసాగుతున్నాయి. కొత్త కోర్సులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**శివారెడ్డిపేట పారిశ్రామికవాడలో..**వికారాబాద్‌కు పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయడంతో ప్రారంభంలో అరకొర సౌకర్యాలతో శివారెడ్డిపేట పారిశ్రామికవాడలోని షెడ్లలో తరగతులు నిర్వహించారు. అనంతరం వికారాబాద్‌కు 6 కి.మీ.దూరంలోని కొంపల్లిలో పక్కా భవనం నిర్మించారు. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన భవనాన్ని 2016లో ప్రారంభించారు. కళాశాల ప్రారంభంలో సివిల్, ఎలక్ట్రికల్, ఈసీఈ కోర్సులు ఏర్పాటు చేశారు. మూడు కోర్సుల్లో కలిపి 180 సీట్లు ఉన్నాయి.

**అన్ని సౌకర్యాలున్నాయి..:** పాత కోర్సులతోపాటు కొత్తగా కంప్యూటర్స్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ కోర్సులను ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కొత్త కోర్సులకు అవసరమైన సదుపాయాలున్నాయి. కళాశాల 8 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. పక్కా భవనం, అత్యాధునిక వసతులతో ప్రయోగశాల ఉంది. ఈ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. విద్యార్థుల కోసం పక్కా వసతి గృహం ఉంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కళాశాల కొనసాగుతోంది. పరిగి, తాండూరులో కొత్తగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేయాలని ఏళ్లుగా విద్యార్థులు కోరుతున్నారు.

**విద్యార్థులకు మంచి అవకాశం..:** పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సు గొప్ప వరం లాంటిది. డిప్లొమా తరవాత వెంటనే పరిశ్రమల్లో చేరే అవకాశముంటుంది. తక్కువ ఖర్చుతో సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవచ్చని, పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేస్తే వెంటనే ఏదో పరిశ్రమలో ఉద్యోగం సులభంగా లభిస్తుందని కళాశాల అధ్యాపకులు చెబుతున్నారు. ఇంజినీరింగ్, రోడ్లు, భవనాలు, ఎయిర్‌లైన్స్, మెట్రో, రవాణా శాఖ, ఆర్టీసీ, ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కం, బీహెచ్‌ఈఎల్, ఎన్‌టీపీసీ, ఆర్మీ, నేవీ, సింగరేణి, కార్పొరేట్ సంస్థలతోపాటు సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయని వారు తెలిపారు.

# పైసలిచ్చి.. రేషన్ కార్డులు పట్టి!



కరీంనగర్ : కరీంనగర్‌లో ఏటా రూ.కోట్ల టర్నోవర్ సాగించే ఓ వ్యాపారి రేషన్‌కార్డు తీసుకున్నారు. తనకు తెలిసిన వ్యక్తి ద్వారా ఈ కార్డును పొందారు. దళారికి రూ.5 వేలు ఇస్తే పని అయిపోయింది. పెద్దపల్లి పట్టణంలో చౌకధరల దుకాణాల వద్దకు కారులో వచ్చి నెల నెలా రేషన్ బియ్యం తీసుకెళ్తున్నారు. ఇటీవల కొత్తకార్డుల జారీ సమయంలోనూ ఇలాంటి వారు కార్డులు పొందారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లిల్లో హోటళ్లు, వస్త్ర వ్యాపారాలను నిర్వహించే వారిలో కొందరు రేషన్ కార్డులు తీసుకున్నారు. వారు ఏటా రూ.కోట్లలో వ్యాపార లావాదేవీలు నిర్వహించేవారే.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో బడా నాయకులు, పెద్ద వ్యాపార కుటుంబాలకు చెందిన వారికి కూడా రేషన్ కార్డు రావడాన్ని చూసి విస్తుపోతున్నారు. ఏటా రూ.లక్షలు సంపాదించే వ్యాపారులు.. సొంత భవనాలు, భూములు ఉండి.. నెలకు రూ.లక్షల్లో ఆదాయం పొందుతున్నవారు.. ఖరీదైన కార్లలో తిరిగేవారూ రేషన్ కార్డులు పొందారు.. అంగట్లో సరకు లెక్క దళారులు ధర కట్టడంతో డబ్బున్నవారు ఉపయోగించుకున్నారు.. కొన్నిచోట్ల మీసేవ కేంద్రాల నిర్వాహకులు.. ఇంకొన్ని చోట్ల తహసీల్దార్ కార్యాలయంలోని కిందిస్థాయి సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు ఈ దళారుల అవతారమెత్తారు.. డబ్బున్నవారినే కాదు.. తక్కువ ఆదాయం ఉన్నవారి నుంచీ 'అంతా మేమే చూసుకుంటాం' అని చెప్పి వసూళ్ల పర్వానికి తెరతీశారు. అనర్హులకు కార్డులు అందజేశారు.

**ఉమ్మడి జిల్లాలో..**

ఈ ఏడాది జనవరిలో 9,77,333 కార్డులు ఉండగా అక్టోబరు వరకు 10,98,293 కార్డులు అయ్యాయి. 1,20,960 పెరిగాయి.

ఈ ఏడాది జులైట్క 14 నుంచి కొత్త కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

నిరంతర ప్రక్రియ అవడం వల్ల ఇప్పటికీ ఇంకా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

**కలెక్టర్ల దృష్టికి వెళ్లడంతో...**డబ్బులు తీసుకుని కార్డులు జారీ చేశారనే ఫిర్యాదులు జిల్లా కలెక్టర్లకు వెళ్లడంతో వీటి విషయమై దృష్టి సారించారు. కింది స్థాయి సిబ్బందితోపాటు దళారుల ప్రమేయం ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించి మరింత లోతుగా ఆరా తీయాలని ఆర్డీవోలు, పౌరసరఫరాల శాఖ డీఎస్‌వోలను ఆదేశించినట్లు తెలిసింది. ముందుగా కొన్ని చౌకధరల దుకాణాలకు ఎంపిక చేసుకుని వాటిల్లో పరిశీలించే దిశగా అధికారులు ముందుకెళ్తున్నారు.

# అసంపూర్తిగా కొన్ని.. మొదలుకానివి మరిన్ని



మెట్‌పల్లి : మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల వాగుపై వంతెన నిర్మాణానికి స్థానికులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పాలకులు హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. అవతల గ్రామాలకు, పొలాలకు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. పక్షం రోజుల క్రితం కూడా వాగులోకి భారీగా నీరురావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం రూ.6.80 కోట్లు మంజూరు చేసింది. ఈ వంతెన పూర్తయితే మెట్‌పల్లి వాసులు కోనరావుపేట, కథలాపూర్ మండలం, వేములవాడ పుణ్యక్షేత్రానికి వెళ్లటానికి దూరభారం తగ్గుతోంది.

మెట్‌పల్లి మండలం ఏఎస్‌ఆర్ తండా కల్వర్టుపై వంతెన నిర్మాణానికి 2022లో రూ.81 లక్షలు మంజూరయ్యాయి. కాని ఇప్పటి వరకు పనుల్లో కదలిక లేదు. ఏటా కల్వర్టుపై నుంచి నీరు పారి రాకపోకలు నిలిచిపోతుండడంతో తండా వాసులు ఆందోళన చెందుతున్నారు. పదిహేను రోజుల క్రితం భారీ వర్షానికి నీరు చేరి ఇబ్బందులు పడ్డారు. వంతెన పనులు చేపట్టి పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఏళ్లు గడుస్తున్నా జిల్లాలోని పలు గ్రామాలకు వానకాలంలో రవాణా కష్టాలు ఎదురవుతున్నాయి. రాకపోకలు సజావుగా సాగాలంటే ఆయా మార్గాల్లో అవసరమైన చోట వారధులు అవసరం ఉండగా.. నిధులు మంజూరైనా పనులు మొదలవటం లేదు. దీంతో ఏటా వర్షాకాలంలో కల్వర్టులపై ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పారి ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. మరికొన్ని వంతెనల పనులు ప్రారంభమై అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. నిధులు మంజూరైనా పనులు చేపట్టడానికి గుత్తేదారులు ఆసక్తి చూపటం లేదని తెలుస్తోంది. ఈ విషయమై 'న్యూస్‌టుడే' పీఆర్ డీఈ రమణారెడ్డిని సంప్రదించగా.. ప్రారంభం కాని పనుల నివేదికను ప్రభుత్వానికి సమర్పించినట్లు చెప్పారు.

**ఎక్కడెక్కడంటే..**

మెట్‌పల్లి మండలం చౌలమద్ది శివారులో వాగుపై వంతెన పనులు ఏళ్లుగా సాగుతున్నాయి. వంతెన పూర్తవగా.. ఇరువైపులా కొన్ని పనులు పూర్తి చేయాల్సి ఉంది. వంతెనపై అక్కడక్కడ ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా ఉన్నాయి.

ఆత్మకూర్–పాటిమీదితండా మధ్య కల్వర్టు స్థానంలో వంతెనకు 2022లో రూ.53 లక్షలు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించలేదు. చింతలపేట శివారులో ఆర్‌అండ్‌బీ రహదారిపై వంతెన పనులు అసంపూర్తిగా మిగిలాయి.మల్లాపూర్ మండలం రాఘవపేట–చిట్టాపూర్, సిరిపూర్–నడికుడ, వాల్గొండ–గొర్రెపల్లి, మల్లాపూర్–గొర్రెపల్లి బైపాస్‌రోడ్డు వంతెన పనులు చేపట్టాలి.

బ్రహీంపట్నం–వర్షకొండ ఆర్‌అండ్‌బీ రహదారి మధ్య రెండు కల్వర్టుల స్థానంలో వంతెనలకు రూ.2 కోట్ల చొప్పున మంజూరైనా పరిస్థితి యథావిధిగా ఉంది. యామాపూర్–ఫకీర్‌కొండాపూర్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి.కోరుట్ల మండలం సంగెం–ఏఖీన్‌పూర్ వంతెనకు రూ.1.50 కోట్లు మంజూరైనా పనులు మొదలుకాలేదు.

## పుట్టపర్తికి.. 'నిమ్మ' పచ్చడి

నకిరేకల్ : ఉత్సవాల్లో 'నిమ్మ' రుచులు పసందు చేయనున్నాయి. వచ్చే నెల 13 నుంచి 23 వరకు ఏపీలోని సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో సత్యసాయి శత జయంతి ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. వీటికి భారత్‌తో పాటు వివిధ దేశాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేయనున్నారు. అక్కడికి వచ్చే భక్తులకు 'నకిరేకల్ నిమ్మ' రుచులను అందించేందుకు స్థానిక సత్యసాయి సేవా సమితి కృషి చేస్తోంది. నకిరేకల్‌లోని సత్యసాయి మందిరంలో 30 క్వింటాళ్లకు పైగా నిమ్మ పచ్చడిని భక్తులే స్వయంగా తయారు చేస్తున్నారు. నకిరేకల్ ప్రాంతం నిమ్మకు ప్రసిద్ధి చెందడంతో భక్తులకు ఈ రుచులను చూపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సత్యసాయి సేవా సమితి నకిరేకల్ అధ్యక్షుడు గర్రె శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ దేవరశెట్టి శ్రీనివాసు లు తెలిపారు. ఏప్రిల్‌లో ఈ ప్రాంతంలోని నాణ్యమైన నిమ్మ కాయలు సేకరించి ఊరబెట్టామని, రెండు రోజులుగా మహిళా భక్తుల సహకారం తో పచ్చడిని తయారు చేస్తున్నామని వివరించారు. పరిశుభ్రమైన వాతావరణంలో తయారుచేసి పటిష్ఠంగా ప్యాక్‌చేసి ఈనెల చివరి నాటికి పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయానికి చేరవేస్తామన్నారు. అక్కడ నాణ్యత పరీక్షలు నిర్వహించి ఉత్సవాలకు వచ్చే భక్తులకు అల్పాహారం, భోజన సమయంలో వడ్డిస్తారని వివరించారు.

## పరికరాల్లేక.. ఫలించని ప్రయోగం

సూర్యాపేట : ప్రయోగ ప్రక్రియ ఇంటర్మీడియట్‌లో విద్యార్థి ఉన్నతికి ఎంతో కీలకం. అలాంటి ప్రయోగాల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గదులు, పరికరాలు, రసాయనాల కొరత వేధిస్తోంది. ప్రైవేటులోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. అత్యధికంగా పరీక్షలకు ముందు కొద్దిరోజులు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫిబ్రవరి 1 నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది.

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు 36 ఉండగా, 19 కస్తూర్బాగాంధీ, ఆదర్శ పాఠశాలలో ఇంటర్ కళాశాలలు నిర్వహిస్తున్నారు. ప్రథమ 13,100, ద్వితీయ 12,430 మంది విద్యార్థులు చదువుతున్నారు. పరికరాలు, రసాయనాల కొరత వల్ల ప్రయోగ తరగతులకు సంబంధించి సందిగ్ధం నెలకొంది. కొన్ని కళాశాలల్లో నేటికీ ప్రారంభించలేదు. కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో సరిపోను గదుల్లేక ఒకే గదిలో నిర్వహిస్తున్నారు.



పెన్‌పహాడ్ కేజీబీవీలో ఇంటర్మీడియట్ తరగతుల నిర్వహణకే గదుల కొరత నెలకొంది. దీంతో ఒకే గదిలో ల్యాబ్, గ్రంథాలయం ఏర్పాటు చేశారు. పరికరాలు, రసాయనాలు అందుబాటులో ఉన్నాయి. ల్యాబ్ సామగ్రి లేదు. ఇబ్బందులు పడుతూ, ప్రయోగాలు నిర్వహిస్తున్నారు.

**త్వరలో రసాయనాలు**ప్రభుత్వ కళాశాలల్లో పరికరాలు ఉన్నాయి. వీటికి త్వరలో రసాయనాలు రానున్నాయి. ప్రైవేటులో అన్నింట్లో అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశాలు జారీ చేశాం. కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లోనే ప్రయోగాలు చేయించాల్సి ఉంది. పరీక్ష మాత్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేయనున్నాం. సీసీ కెమెరాల నిర్వహణలో పరీక్షలు జరగనున్నాయి.భానునాయక్, డీఐఈవో

## తప్పుల తక్కెడ.. అమ్మకాలకు యాతన

జుక్కల్ : జుక్కల్ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన కపాస్ యాప్‌లో వివరాలు నమోదు చేసుకున్నారు. జెండర్ ఐచ్ఛికం(ఆప్షన్)లో వారి వివరాలు పురుషులకు బదులు మహిళలుగా నమోదయ్యాయి. పేర్ల అక్షరాల్లోనూ తప్పులు దొర్లాయి. వాటిని సరిదిద్దేందుకు ఇప్పట్లో అవకాశం లేదు. దీంతో పత్తి విక్రయం, విక్రయించిన తర్వాత ఖాతాల్లో డబ్బు జమ అయ్యే సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది".


పత్తి కొనుగోళ్లలో దళారుల ప్రమేయాన్ని నిలువరిస్తూ రైతులు ఇబ్బందులు పడకుండా విక్రయించుకోవాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం.. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా కపాస్ కిసాన్ యాప్‌ను ప్రవేశపెట్టింది. పత్తి రైతులు మొదట ఇందులో తమ వివరాలు పొందుపరిచి స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. యాప్‌లో వివరాల్లో తప్పులు దొర్లుతుండటం, కొనుగోలు కేంద్రాల వివరాలు కనిపించకపోవడం తదితరాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రైతులు సాగు చేసిన పత్తి విస్తీర్ణం, కర్షకుల వివరాలను ప్రభుత్వం ఆన్‌లైన్‌లో నమోదు చేయించి ఆ జాబితాను సీసీఐకి ఇచ్చింది. దీని ఆధారంగా రైతులు యాప్‌లో స్లాట్ బుకింగ్ చేసుకొనే అవకాశం కల్పించారు. అందుకు రైతులు 'కపాస్'లో ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, సాగు విస్తీర్ణం నమోదు చేయాలి. రైతు మొబైల్ నంబరు ఎంటర్ చేయగానే ఓటీపీ వస్తుంది. అనంతరం స్లాట్ బుకింగ్ ఐచ్ఛికంపై క్లిక్ చేస్తే.. ఏ రోజు.. ఏ సమయానికి పత్తిని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలో సీసీఐ సూచిస్తుంది. అధికారులు మొదట యాప్‌లో వివరాలు నమోదుచేసే సమయంలో తప్పులు దొర్లాయి. వాటిని సరిదిద్దేందుకు ప్రస్తుతం అవకాశం లేదు. అధికారులు స్పందించి యాప్‌లో వివరాలను సవరించి విక్రయాలకు అవాంతరాలు ఎదురవకుండా చూడాలని పత్తి రైతులు కోరుతున్నారు.

అధికారులను సంప్రదించాలి..

సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోళ్లు ఇంకా ప్రారంభం కాలేదు. ప్రారంభమైతేనే స్లాట్ బుకింగ్ వివరాలు కపాస్ కిసాన్ యాప్‌లో కనిపిస్తాయి. యాప్‌లో వివరాల నమోదు కోసం రైతులు ఆధార్, పట్టాపాసుపుస్తకం, స్మార్ట్‌ఫోన్‌తో వ్యవసాయాధికారులను సంప్రదించాలి. సత్యనారాయణ, పర్యవేక్షకులు, ఏఎంసీ మద్నూర్

## పురాల్లో జీ+1గా ఇందిరమ్మ ఇళ్లు

నిజామాబాద్ : 'ఇందిరమ్మ ఇళ్ల' నిర్మాణంపై ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో.. బల్దియాల పరిధిలోని పేదలకు ఊరట లభించనుంది. ప్రభుత్వం మంజూరు చేసే ఇంటిని కనీసం 600 చదరపు అడుగుల స్థలంలో నిర్మించుకోవాలనే నిబంధన ఉంది. దీంతో కొందరు లబ్ధిదారులు నిర్మాణం చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదు. గ్రామాలతో పోల్చిచూస్తే పట్టణాల్లో ఎక్కువ మంది వెనుకంజ వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిబంధనను సడలించింది. 400 చదరపు అడుగుల కంటే తక్కువ స్థలం ఉన్నవారు 'జీ+1' విధానంలో ఇంటిని నిర్మించుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఇందిరమ్మ ఇళ్లను 'జీ+1'గా నిర్మించుకునే అవకాశం కల్పించడంతో నిజామాబాద్ నగరపాలకం, ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ పురపాలక



సంఘాల పరిధిలోని లబ్ధిదారులకు ఊరట కలగనుంది. నగరంతో పాటు మిగతా మూడు పట్టణాల్లో కలిపి 2,950 ఇళ్లను వేగంగా పూర్తిచేయించాలని ఉన్నతాధికారులు లక్ష్యం విధించారు. ఇప్పటి వరకు 1,650 నిర్మాణాలు మాత్రమే ప్రారంభమయ్యాయి. లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసినా కొందరు ఆర్థిక స్థోమత లేక వెనుకడుగు వేస్తూ వచ్చారు. 'మెప్మా' ద్వారా ఇంటి రుణం అందిస్తున్నా స్పందించలేదు. ఇందుక్కారణం.. తగినంత సొంత స్థలం అందుబాటులో లేకపోవడమే. ఈ నేపథ్యంలో నిబంధనలో వెసులుబాటు కల్పిస్తున్న విషయాన్ని లబ్ధిదారులకు తెలపాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. పురపాలక సంఘాల్లో అధికారులు విస్తృత ప్రచారం చేపట్టాలని, ఇళ్ల నిర్మాణాల్లో పురోగతికి కృషిచేయాలని సూచించారు.

## యాసంగికైనా భరోసా కలిగేనా!

జగిత్యాల : రాష్ట్రంలో అధికారంలోకి వస్తే పంటల(ఫసల్) బీమా పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించిన నేతల హామీలు అమలుకు నోచుకోవడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు సీజన్లు గడిచినా అన్నదాతకు భరోసా కరవైంది. అక్టోబరు నుంచి యాసంగి పంట కాలం మొదలైన నేపథ్యంలో ఈసారైనా బీమా పథకం అమలుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

**అత్యధికంగా 9 పంటలకు..**

యాసంగి సీజన్‌లో పంటల బీమాను అమలు చేయాలంటే ఇప్పటి నుంచి డిసెంబరు 15లోగా నోటిఫికేషన్ వెలువరించాల్సి ఉంటుంది. గతంలో బీమా కంపెనీకి రైతులు 50 శాతం ప్రీమియం చెల్లిస్తే 25 శాతం కేంద్రం, 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేవి. మొత్తం ప్రీమియంను రైతుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని నేతలు పేర్కొన్నారు. ఇది అమలైతేనే అన్నదాతకు ఊరట కలుగుతుంది. గతంలో రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో జగిత్యాల జిల్లాలో 9 పంటలకు బీమా పథకం అమలైంది. మిగిలిన జిల్లాల్లో 6 పంటలకు బీమా ఉండేది. ప్రధానమంత్రి ఫసల్ బీమా ద్వారా వరి, మక్క, వేరుశనగ, పెసర, మినుము, నువ్వులు, వాతావరణ ఆధారిత బీమా ద్వారా మామిడి, వానాకాలంలో పత్తి, మిరపకు కూడా బీమా ఉండేది. కొన్ని సీజన్లుగా అమలు చేయకపోవడంతో ప్రకృతి విపత్తుల సమయంలో రైతులకు ఆసరా కరవైంది. మరోవైపు పంటలు దెబ్బతిన్నపుడు ఎకరాకు



రూ.10 వేల చొప్పున పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా పూర్తి స్థాయిలో ఇవ్వకపోవడంతో రైతులు రెండు రకాలుగా నష్టపోతున్నారు.

**ఇవీ లోపాలు**

2000లో పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టి 2019 వరకు 31 సీజన్లలో అమలు చేశారు. ఉమ్మడి జిల్లాగా ఉన్నపుడు మొత్తం 9.13 లక్షల మంది రైతులు రూ.62.12 కోట్ల ప్రీమియం చెల్లించగా ఇంతే మొత్తంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంపెనీకి చెల్లించాయి. చాలా సీజన్లలో రూ.వందల కోట్లలో రైతులు నష్టపోయినా 3.72 లక్షల మందికి రూ.72 కోట్ల పరిహారం మాత్రమే వచ్చింది. మామిడిలో వాతావరణ బీమాను అమలు చేసినా కనీసం చెల్లించిన ప్రీమియం మేరకు కూడా పరిహారం రాలేదు. ఈ నేపథ్యంలో రైతువారీగా లేదా కమతం, సర్వే నంబర్ల వారీగా బీమా అమలు, ప్రీమియం చెల్లింపును రైతుల ఇష్టానుసారం చేయడం ద్వారా పథకం అమలులోని లోపాలను చాలావరకు అరికట్టవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పథకంలో మార్పులకు బదులు అయిదేళ్ల కిందట కేవలం కిస్తీ చెల్లింపును రైతుల ఇష్టానుసారం చేసి అమలు బాధ్యతను కంపెనీకి వదిలిపెట్టాయి. పైగా తాము చెల్లించాల్సిన కిస్తీపై ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించనందున రైతుల్లో నమ్మకం సడలి బీమా వైపు వెళ్లలేదు. ఇప్పటికైనా ఫసల్ బీమా పథకానికి నోటిఫికేషన్‌ను వెలువరించడంతో పాటు బీమా పరిధిలోకి వచ్చే రైతులు, కుటుంబసభ్యులకు రూ.2 లక్షల ప్రమాద బీమా, అంగవైకల్యం సంభవిస్తే రూ.1.25 లక్షల పరిహారం, ట్రాక్టర్లు, పంపుసెట్లు తదితర పరికరాలకు పరిహారం అందేలా పథకం విస్తరణకు చర్యలు చేపట్టాల్సి ఉంది.

## పంటమార్పిడి.. మేలైన దిగుబడి

చిట్యాల: పాతికేళ్లుగా పంట మార్పిడి విధానాన్ని అవలంబిస్తూ భిన్నంగా ముందుకు సాగుతున్నారు చిట్యాల మండలం తాళ్లవెల్లంల గ్రామానికి చెందిన పజ్జూరు అజయ్‌కుమార్‌రెడ్డి. పంటమార్పిడితో కూలీల కొరత, ఒకే తరహా పంటలను కొనసాగించడం వల్ల ఆశించే చీడపీడల బెడద, రసాయనాలు, క్రిమిసంహారక మందుల పిచికారీ ఖర్చును తగ్గించవచ్చంటున్నారు. ప్రస్తుతం 4ఎకరాల విస్తీర్ణంలో సీతాఫలం, 5ఎకరాల్లో అరటి, కొబ్బరి సాగు చేస్తున్నారు.

**చెరకుతో మొదలు**

గ్రామంలో ఆముదం, పత్తి, వరిని ప్రధానంగా సాగు చేసేవారు. పంటలపై కొంతమేర అధ్యయనం చేసి, పాతికేళ్ల క్రితం 5 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా చెరకు సాగు చేపట్టారు. ఖమ్మం నుంచి విత్తనం తెప్పించారు. దిగుబడి బాగానే వచ్చింది. తొలుత మిర్యాలగూడ ప్రాంతంలోని కొనుగోలు కేంద్రానికి దిగుబడిని తీసుకెళ్లి విక్రయించారు. తర్వాత మెదక్ జిల్లా జోగిపేట్ ప్రాంతానికీ తీసుకెళ్లారు. దూరప్రాంతం, రవాణా ఛార్జీలు అధికమవుతుండడంతో చెరకు సాగును అక్కడితో ఆపేశారు. అప్పుడే ఎకరానికి సుమారు రూ.50వేలు గిట్టుబాటైందని



పేర్కొన్నారు. అనంతరం 5ఎకరాల్లో చేపల చెరువును నిర్మించి, కృష్ణా జిల్లా కైకలూరు నుంచి చేపపిల్లలను తెప్పించి పెంపకాన్ని ప్రారంభించారు. గ్రామ పరిసరాల్లోని ప్రజలే తమ మార్కెట్‌గా.. చెరువు దగ్గరే పట్టి విక్రయించేవారు. ఎకరానికి ఏటా రూ.లక్ష వరకు ఆదాయాన్ని పొందామన్నారు. నాలుగేళ్లుగా 4ఎకరాల్లో దేశవాళీ రకం సీతాఫలాన్ని సాగు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా బాటసింగారం పండ్ల మార్కెట్‌కు తీసుకెళ్లి దిగుబడిని విక్రయించగా ప్రస్తుతం కాంట్రాక్టరుకు అప్పగించారు. రైతు స్వయంగా తీసుకెళ్లి మార్కెట్ చేసుకుంటే ఎకరానికి రూ.70వేలదాకా గిట్టుబాటు అవుతుందన్నారు. 5 ఎకరాల్లో అరటి, కొబ్బరి సాగును తాజాగా చేపట్టారు. కొబ్బరి ఒక వరస, అరటి మూడు వరసల చొప్పున మొక్కలు నాటించారు. కొబ్బరి మొక్క ఒక్కొక్కటి రూ.270, అరటి రూ.14 చొప్పున వెచ్చించారు. అరటి 4000, కొబ్బరి 400 మొక్కలు నాటించారు. వ్యాపారులు అరటి తోట దగ్గరకే వచ్చి కొనుగోలు చేస్తారని, కొబ్బరి మాత్రం స్థానికంగా మార్కెట్ చేసుకోవచ్చని తెలిపారు. పత్తి వంటి వాణిజ్య పంటలతో పోల్చితే కూలీలు, రసాయనాల పిచికారీ వంటి ఖర్చులు ఈ పంటలకు నామమాత్రమే అంటున్నారు. రైతులు పంటల మార్పిడితో ముందుకు సాగి సాగునష్టాలను నివారించుకోవాలని సూచించారు.

## భావి నగరమంతా భూగర్భ విద్యుత్ తీగలు



హైదరాబాద్: భారతదేశంలోనే తొలి అత్యాధునిక నగరమైన భారత్ ఫ్యూచర్ సిటీలో విద్యుత్ వ్యవస్థ మొత్తాన్ని భూగర్భ కేబుళ్ల ద్వారా నిర్వహించనున్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో ఫ్యూచర్‌సిటీ నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేలపై విద్యుత్ స్తంభాలు, తీగలు లేకుండా చూడాలంటూ ఆదేశించడంతో భావినగర అభివృద్ధి సంస్థ, విద్యుత్ అధికారులు అంచనాలు రూపొందించారు.

**నైపుణ్యాల విశ్వవిద్యాలయం.. సమీకృత గురుకుల పాఠశాల..** ఫ్యూచర్ సిటీలో నైపుణ్యాల విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణాలు జరుగుతున్నాయి. నైపుణ్యాల విశ్వవిద్యాలయాన్ని డిసెంబరు 9న ప్రారంభించనున్నారు. నిర్వాసితుల స్థలాల్లో లే-అవుట్లను వేసి పనులు ప్రారంభించేందుకూ సన్నాహాలు జరుగుతున్నాయి. రేయింబవళ్లు పనులు చేసేందుకు మీర్‌ఖాన్‌పేటలో 33/11కేవీ ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేటస్తున్నారు. ఇప్పటికే లే-అవుట్లు, రహదారులు మార్కింగ్ చేసిన నేపథ్యంలో భూగర్భ కేబుళ్ల నిర్మాణానికి మార్గాన్ని రూపొందించనున్నారు.

**ఫ్యాబ్‌సిటీ.. మామిడిపల్లి నుంచి**

మీర్‌ఖాన్‌పేట, ముచ్చర్ల మధ్య ఏర్పాటవుతున్న భావినగరంలో పర్యావరణ, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు, పరిశ్రమలు, ఫార్మా కంపెనీలు, ఐటీ సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించనున్న నేపథ్యంలో విద్యుత్ అవసరాలకు ఇబ్బందులు లేకుండా ఫ్యాబ్‌సిటీ, మామిడిపల్లిలోని ఉపకేంద్రాల నుంచి విద్యుత్ సరఫరా చేయనున్నారు. మరోవైపు భూగర్భంలో విద్యుత్ తీగలు ఏర్పాటుచేసేందుకు ఒక డక్ట్ వినియోగించనున్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఈ డక్ట్‌లోనే తాగునీటి పైప్‌లైన్లు వేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ డక్ట్‌లోనే ప్రైవేటు సంస్థలు, బీఎస్ఎన్ఎల్ సంస్థల ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ లైన్లు అందులో ఉండేలా ప్రణాళికలు రూపొందించారు.

**అంచనాలు ఇలా...** అండర్ గ్రౌండ్ లైన్లు వేయనున్న పరిధి: 30-40 కి.మీ.
33 కేవీ తీగలకు ఒక కి.మీ.కు..: రూ.45 లక్షలు
11 కేవీ తీగలకు ఒక కి.మీ.కు ఖర్చు..: రూ.16 లక్షలు

## స్థలం సర్కారుది.. పట్టా ప్రైవేటుది.. రూ.500 కోట్ల విలువ.. స్థిరాస్తి సంస్థ భారీ పన్నాగం



హైదరాబాద్: రాజధానికి అత్యంత సమీపంలోని ఇబ్రహీంపట్నం మండలం కొంగర కలాన్ గ్రామంలోని సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూమి. ప్రస్తుతం ఎకరా రూ.5 కోట్లు పలుకుతోంది. అంటే విలువ రూ.500 కోట్లు. ఆ భూమిని అక్రమార్కులు రియల్ సంస్థ పేరు మీద రికార్డుల్లో నమోదు చేయించుకున్నారు. ఇప్పుడు హద్దులు పాతి సొంతం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు.

**నాటి నేతల ఆశీస్సులతో..**

కొంగరకలాన్ గ్రామంలోని వ్యవసాయ సీలింగ్ భూములపై కొందరు అక్రమార్కుల కన్ను పడింది. సీలింగ్ పరిమితిలోని భూముల యజమానులతో మాట్లాడి వాటిని మినహాయింపజేస్తామని, తమకు విక్రయించాలంటూ ఒప్పందం కుదుర్చుకున్నారు. రెవెన్యూ ఉన్నతాధికారులు, గత ప్రభుత్వంలోని ముగ్గురు ప్రజాప్రతినిధుల ఆశీస్సులతో సీలింగ్ నుంచి వాటికి మినహాయింపు తెప్పించుకున్నారు.

**ఎలా చేశారంటే..**

ఈ వ్యవహారం వెనుక ముగ్గురు రెవెన్యూ అధికారులు కీలకపాత్ర పోషించినట్టు తెలిసింది. కిందిస్థాయి అధికారి ఒకరు, ఒక డివిజన్ అధికారి, ఒక జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారి అంతా తామై వ్యవహరించారని విశ్వసనీయ సమాచారం. ఐదేళ్ల కిందటి వరకు ఈ భూములు 22ఏ షెడ్యూలు నిషేధిత జాబితాలో ఉన్నాయని ఇబ్రహీంపట్నం తహసీల్దారు ధ్రువీకరించి రికార్డుల్లో నమోదు చేశారు. రియల్ సంస్థ ప్రతినిధులు భూ యజమానులను తెరపైకి తీసుకొచ్చారు. అవి సీలింగ్ భూములు కావని.. తామూ, తమ కుటుంబ సభ్యులందరూ పంచుకున్నామంటూ రంగారెడ్డి కలెక్టర్, ఇబ్రహీంపట్నం ఆర్డీవోకు సమాంతరంగా దరఖాస్తులు సమర్పించారు. భూ యజమానుల దరఖాస్తులను పరిశీలించిన ఆర్డీవో వాటిని జిల్లా ట్రైబ్యునల్‌కు పంపించారు. సరిగ్గా ఇక్కడే ఒక రెవెన్యూ అధికారి, ఒక జిల్లా రెవెన్యూ అధికారి రంగప్రవేశం చేశారు. రెవెన్యూ అధికారి ట్రైబ్యునల్‌లో నిర్ణయం తీసుకునే అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి భూ యజమానుల కోరిక మేరకు సీలింగ్ పరిమితి నుంచి మినహాయింపు ఇప్పించారు. పక్కా రికార్డులుండేలా జిల్లా రెవెన్యూ అధికారి సూచనలతో ధరణి రికార్డుల్లో రియల్ సంస్థ, ప్రతినిధుల పేర్లను నమోదు చేయించారు.

చర్యలకు సీఎంవో ఆదేశం..

ఇటీవల ఈ భూముల వ్యవహారంపై ఓ రెవెన్యూ అధికారికి అనుమానం వచ్చి ఆరా తీయగా.. ఐదేళ్ల కిందటే ఓ రియల్ సంస్థ ప్రతినిధులు ఇదంతా చేశారని తేలింది. ప్రభుత్వానికి నివేదించగా.. వాటిని పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలని సీఎంవో కార్యాలయం ఆదేశించింది. సంబంధిత అధికారులపై చర్యలకు మరిన్ని సాక్ష్యాధారాలు సేకరిస్తున్నారు. లోతుగా పరిశోధన చేస్తున్నామని.. భూములను రక్షిస్తామని రెవెన్యూ శాఖ ఉన్నతాధికారికు తెలిపారు.

## గుట్టుగా గుటకేస్తున్నారు!

హుజూరాబాద్ : ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన గుట్టలను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. ప్రశ్నిస్తే రోడ్డు పనులకనీ బుకాయిస్తూ రవాణా చేస్తున్నారు. హుజూరాబాద్ మండలంలోని సిర్సపల్లి, సింగాపూర్ గ్రామాల మధ్యలో పాండవుల తదితర పేర్లతో గుట్టలు ఉన్నాయి. జాతీయ రహదారి కోసం ఇక్కడి నుంచి అనుమతులతోనే ఎర్రమట్టిని తరలిస్తున్నారు. ఇదే అదనుగా అక్రమార్కులు సైతం మట్టి అక్రమ దందాకు తెరలేపారు. అనుమతులు పొందకుండా నెలల తరబడి గుట్టలు తోడుతూ డంపులుగా పోసి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రిళ్లు దూరప్రాంతాలకు తరలిస్తున్నారు.

**డిమాండ్ ఆసరా చేసుకొని**

పాండవుల గుట్ట సమీపంలోని గుట్టల్లో ఎర్రమట్టి లభిస్తోంది. దీనికి డిమాండ్ అధికంగా ఉంటుంది. ఇదే అక్రమ వ్యాపారులకు సిరులు కురిపిస్తోంది. పొక్లెయిన్ తదితర యంత్రాలతో మట్టి తోడి ట్రాక్టర్లు, ట్రిప్పర్లు, లారీల్లో తరలిస్తున్నారు. జమ్మికుంట, ఇల్లందకుంట, కమలాపూర్, సైదాపూర్, హుజూరాబాద్ పట్టణంలోని పలు ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. దూరాన్ని బట్టి ట్రిప్పునకు రూ.1500 నుంచి రూ.2500 వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. జాతీయ రహదారి నిర్మాణ కంపెనీ ఆయా గుట్టల నుంచి నిబంధనలకు విరుద్ధంగా మట్టి తోడుతోందని సమీప గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇష్టానుసారంగా తవ్వటంతో లోతైన గోతులు ఏర్పడ్డాయని, మైనింగ్ అధికారులు ఇటు వైపు ఎందుకు రావటం లేదని ప్రశ్నిస్తున్నారు.

**బహిరంగంగానే డంపులు**

మట్టి విక్రయాల దందా బహిరంగంగానే జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. నిత్యం వందల ట్రిప్పుల మట్టిని డంపు చేసి విక్రయిస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. ఇటీవల రెవెన్యూ, పోలీసుశాఖల అధికారులు మట్టి వాహనాలను పట్టుకోగా ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లు తెచ్చినట్లు సమాచారం. కొద్దిరోజుల క్రితం హుజూరాబాద్ తహసీల్దారు కార్యాలయానికి సమాచారం రావడంతో తహసీల్దార్, మరికొందరు అధికారులు కలిసి పాండవుల గుట్ట వద్దకు వెళ్లారు. వీరు వెళ్లేలోపే అక్రమార్కులు పరారయ్యారు. దీన్ని బట్టి అధికారులు సైతం అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నట్లు అర్థమవుతోంది. సంబంధిత కిందిస్థాయి ఉద్యోగులు, రాత్రి వేళ గస్తీ తిరిగే అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

**అక్రమ మట్టి రవాణాకు అడ్డుకట్ట వేస్తాం**

మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం. గుట్టల తవ్వకాలకు చట్టప్రకారం అనుమతులు ఉన్నాయా? లేదా? అని పరిశీలిస్తాం. లేకపోతే కఠిన చర్యలు తప్పవు. తమ దృష్టికి వచ్చిన వాటిపై పర్యవేక్షించి ఏడీ మైనింగ్ వారిని తనిఖీ కోసం పంపిస్తాం. సంబంధిత అక్రమార్కులు, దళారుల వ్యవస్థపై చర్యలకు ఆదేశిస్తాం. ఆర్డీవో రమేశ్‌బాబు

## వినూత్న బోధన.. విశేష ఆదరణ

కరీంనగర్ : సమాజంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకొని.. ఎప్పటికప్పుడు ఉన్నతీకరణ చెందుతూ విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తున్నారు వారు. కొందరు స్థానికంగా రాణిస్తుండగా.. మరికొందరు దేశ, విదేశాలకు వెళ్లి నైపుణ్యాన్ని పెంచుకుంటున్నారు. మరికొందరు విదేశాల్లోనూ బోధనలో రాణిస్తున్నారు. ఆదివారం 'ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం' సందర్భంగా అలాంటి ఉపాధ్యాయులపై కథనం.

**ఆంగ్లంపై భయం పోగొడుతూ..**

చిగురుమామిడి మండలం ముల్కనూర్‌లోని ఆదర్శ పాఠశాలలో పీజీటీగా పనిచేసే సయ్యద్ ఇర్షాద్ అలీ ఆంగ్ల బోధకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆంగ్లంపై విద్యార్థుల్లోని భయాన్ని తొలగిస్తున్నారు. ఎన్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో నడిచే 'దీక్ష' యాప్‌లో వీడియో పాఠాలను రూపొందించారు. యఎస్‌ఏలోని ఫుల్ బ్రైట్ టీచర్స్ ఎక్స్‌లెన్స్ అవార్డు వారు నిర్వహించే స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించి ఆ దేశంలో 40 రోజులపాటు పలు అంశాలపై శిక్షణ పొందారు. ఎస్‌సీఈఆర్టీ వారి బెస్ట్ ప్రాక్టీస్ పోటీలో జిల్లా నుంచి పాల్గొని ప్రతిభ చాటారు. ఉదయ్‌పూర్‌లో నిర్వహించిన జాతీయ విద్యావిధానం కార్యక్రమంలో మన రాష్ట్రం తరఫున పాల్గొని ప్రసంగించి ప్రశంసలు పొందారు. విద్యార్థులను ఆంగ్లభాషలో తీర్చిదిద్దుతున్నారు. ఇర్షాద్‌ను రాష్ట్ర, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వరించాయి.

**ప్రయోగాలతో ఆకట్టుకునేలా..**

చిగురుమామిడి మండలం ఇందుర్తి జడ్పీ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు బి.ఓదెలు కుమార్ విద్యార్థులు సైన్స్‌పై ఆకర్షితులయ్యేలా బోధిస్తున్నారు. లోకాస్ట్-నోకాస్ట్ పద్ధతిలో ప్రయోగాలు రూపొందిస్తున్నారు. ఈయన పనిచేసిన పాఠశాలల్లోని విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో ప్రతిభ చూపుతుంటారు. 2011లో తిరుపతిలో జరిగిన దక్షిణ భారత విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో పాల్గొని పలు పాఠ్యాంశాలకు సంబంధించి ప్రయోగ కృత్యాలను రూపొందించారు. 2014లో చెన్నైలోని సైన్స్ టెక్నాలజీ ఆడిటోరియంలో దక్షిణ భారత్‌లోని కార్యశాలలో పాల్గొని పేపర్‌క్రాఫ్ట్ ద్వారా రాకెట్ నవనాలు తయారు చేశారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతోపాటు వివిధ సంస్థలు అందించే పలు అవార్డులను ఆయన సొంతం చేసుకున్నారు.

**విదేశీ విద్యార్థులకు పాఠాలు..**

రామడుగు మండలం వెదిర గ్రామానికి చెందిన మల్లారపు రాము విదేశీ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. పదోతరగతి వరకు గ్రామంలో, ఆ తర్వాత ఇంటర్, డిగ్రీ కరీంనగర్‌లో చదివి, ఎంఏ ఇంగ్లిష్ కాకతీయ విశ్వవిద్యాలయం, ఎంఈడీ శాతవాహనలో చదివారు. అనంతరం ఆర్గానిక్ రసాయన శాస్త్రంలో పీజీ చేశారు. పదేళ్లు కరీంనగర్‌లోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పని చేశారు. విదేశీ విద్యార్థులకు బోధించాలన్నదే ఆయన చిన్ననాటి కల. మొదట మాల్దీవుల్లో రెండేళ్లు పని చేశారు. అక్కడి నుంచి చైనాకు వెళ్లారు. ఎనిమిదేళ్లుగా అక్కడే పాఠాలు బోధిస్తున్నారు. ఏటా వేసవిలో అమెరికాలోని జాన్స్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయానికి వెళ్లి పాఠాలు బోధిస్తుంటారు. ఇతని తమ్ముడు వేణు కూడా అబుదాబీలోని అంతర్జాతీయ అమెరికన్ పాఠశాలలో భౌతికశాస్త్రం బోధిస్తున్నారు.

## రూ.కోట్ల భూమి కొట్టేశారు!

చిట్యాల : చిట్యాల పట్టణంలో అధికారిక అనుమతులు పొందిన స్థిరాస్తి వెంచర్లు 18 ఉన్నాయి. మరో 10కి పైగా అనుమలుతు లేనివి ఉన్నాయి. కొన్నిచోట్ల కొనుగోలుదారులకు ప్లాట్లు విక్రయించే సమయంలో పదిశాతం భూమి పంచాయతీకి కేటాయించినట్లు చూపించినా.. తర్వాతి కాలంలో దానిని ప్లాట్లుగా చేసి విక్రయించారు. ఈ ప్లాట్లను కొనుగోలు చేసిన వారు నిర్మాణ అనుమతులు కావాలంటే మార్కెట్ విలువలో 14శాతం రుసుం చెల్లించాల్సి వస్తోంది. అనుమతులు లేని ప్లాట్ల క్రమబద్ధీకరణకు సుమారు 4వేల దరఖాస్తులు అందాయని ఇన్‌ఛార్జి పట్టణ ప్రణాళిక అధికారి శివ పేర్కొన్నారు. నల్గొండ జిల్లాలోని పట్టణాలు, పల్లెల్లో వేసిన వెంచర్లలో ప్రజా అవసరాలు, పార్కులు, మౌలిక సౌకర్యాల ఏర్పాటు కోసం వదిలిన రూ.కోట్ల విలువైన స్థలాలు మాయమయ్యాయి. అధికారులు, పాలకులు కుమ్మక్కై పెద్ద మొత్తంలో స్థలాలు కాజేశారు. 2012కు ముందు మండల కేంద్రాలను, సమీప ప్రాంతాలను కలిపి పురపాలికలను ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీల నుంచి మున్సిపాలిటీలకు దస్త్రాలు అప్పగించే సమయంలోనే ప్రభుత్వానికి అప్పగించాల్సిన 10శాతం స్థలాల రికార్డులు ఆనవాలు లేకుండా చేశారు. ప్రధానంగా చండూరు, చిట్యాల, నకిరేకల్, దేవరకొండ, మిర్యాలగూడ, కొండమల్లేపల్లి, నార్కట్‌పల్లి, మర్రిగూడ, మునుగోడు, హాలియా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వెంచర్లల్లో పురపాలికలు, పంచాయతీలకు చెందాల్సిన స్థలాలు అధికారులతో కలిసి రాజకీయ నాయకుల భాగస్వామ్యంతో రియల్టర్లు అక్రమాలకు తెరలేపినట్లు ఆరోపణలు వచ్చాయి. నల్గొండ పురపాలిక పరిధిలో మామిళ్లగూడ, చర్లపల్లి, ఆర్జాలబావి ప్రాంతాల్లో వేసిన పాత వెంచర్లకు సంబంధించిన 10శాతం స్థలాలు కొన్నిచోట్ల మాయం చేశారు. వాటిపై రికార్డులు లేకపోవడంతో మున్సిపల్ అధికారులు మిన్నకుండిపోయారు. ప్రస్తుతం 72 ప్రాంతాల్లోని వెంచర్లలో మున్సిపాలిటీకి సుమారు వంద ఎకరాలకు పైగా స్థలాలు ఉన్నాయి. వాటిని కబ్జా కాకుండా శాటిలైట్ జియో ట్యాగింగ్ చేశారు. 20 ప్రాంతాల్లో రక్షణగా ప్రహరీ నిర్మాణాలు చేపట్టగా, మరికొన్ని స్థలాల్లో పట్టణ ప్రకృతి వనాలు, పార్కులను



అభివృద్ధి చేశారు. మరో 30 ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో వాటిపై పరుల కన్ను పడుతోంది.

నకిరేకల్: నకిరేకల్ పురపాలిక ఐదేళ్ల క్రితం ఏర్పడింది. మేజర్ పంచాయతీగా ఉన్న కాలంలో ఇక్కడ 35 వరకు వెంచర్లు వెలిశాయి. పదిశాతం భూమిని ఒకటి, రెండు వెంచర్లలో మినహా మిగతా వాటిల్లో ప్రభుత్వానికి ఇవ్వలేదు. దాదాపు 35 ఎకరాలకుపైగా స్థలాన్ని వెంచర్ల నిర్వాహకులు రిజిస్ట్రేషన్‌చేసి అప్పగించాల్సి ఉంది. కానీ చాలా మంది స్థిరాస్తి వ్యాపారులు ప్లాట్లుగాచేసి విక్రయించేశారు. నేడు నకిరేకల్‌లో ప్రజా అవసరాల కోసం గజం ప్రభుత్వ స్థలం కూడా కరవైన దుస్థితి నెలకొంది.

**కబ్జాకు గురవకుండా భద్రత**

ముసాబ్ అహ్మద్ సయ్యద్, కమిషనర్, నల్గొండ పురపాలిక

నల్గొండలో 2012లో ఏడు గ్రామపంచాయతీలు విలీనం చేశారు. అప్పట్లో సమర్పించిన దస్త్రాల ప్రకారం వెంచర్లలో 10 శాతం స్థలాలు అన్యాక్రాంతం కాకుండా రక్షణ చర్యలు తీసుకున్నాం. జియోట్యాగింగ్ చేయించాం. చాలా వాటికి రక్షణ కోసం ప్రహరీలు నిర్మిస్తున్నాం. ఎక్కడైనా ఆక్రమణకు గురైనట్లు ఉంటే సమాచారం ఇస్తే తప్పనిసరిగా రక్షిస్తాం.




అమరావతి: నవంబర్ 7న జరగాల్సిన ఏపీ కేబినెట్ సమావేశం వాయిదా పడింది. కేబినెట్ భేటీని నవంబర్ 10వ తేదీన నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

నవంబర్ 10వ తేదీకి కేబినెట్ సమావేశం వాయిదా వేస్తూ సీఎస్ కార్యాలయం నోట్ విడుదల చేసింది. మంత్రివర్గ సమావేశం నిర్వహణకు సంబంధించిన మార్పులను గమనించాల్సిందిగా అన్ని శాఖల కార్యదర్శులకు సూచనలు చేసింది. అయితే.. విశాఖ వేదికగా జరిగే పెట్టుబడుల సదస్సుపై మంత్రి వర్గం చర్చించనుంది. మంత్రులు అందరికీ సదస్సు నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు. ఇప్పటికే ఏర్పాట్లపై మంత్రి వర్గ ఉప సంఘం నియామకమైన విషయం తెలిసిందే. దీంతో పాటు రాజధాని అమరావతి పనులు, భూముల కేటాయింపులపై కూడా మంత్రి వర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే.. శాంతి భద్రతల అంశంపై చర్చించి ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కాగా, రాష్ట్రంలో కొనసాగుతున్న మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా.. కేబినెట్ భేటీని వాయిదా వేసినట్లు సమాచారం.




## రైతన్నలకు డిప్యూటీ సీఎం పవన్ భరోసా

కృష్ణా జిల్లా, అక్టోబర్ 30: జిల్లాలోని అవనిగడ్డ నియోజకవర్గంలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈరోజు (గురువారం) పర్యటించారు. తుపాను కారణంగా నష్టపోయిన రైతులను పరామర్శించారు. కోడూరు మండలం కృష్ణాపురం గ్రామంలో నేలకొరిగిన వరి పైరును డిప్యూటీ సీఎం పరిశీలించారు. పంట చేతికి వచ్చే సమయంలో తుపాను తమను ముంచేసిందంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా రైతులను ఆదుకుంటామని, అధైర్య పడవద్దని రైతులకు పవన్ ధైర్యం చెప్పారు.

**పవన్‌తో రైతులు..** డిప్యూటీ సీఎంతో రైతులు తమ బాధను పంచుకున్నారు. తుపాను కారణంగా బాగా నష్టపోయామని.. ఎకరానికి రూ. 30 వేలు ఖర్చు అయ్యిందని తెలిపారు. తడిసిన ధాన్యం, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. ఇటువంటి ప్రకృతి విపత్తుల సమయంలో కౌలు రైతులకు అన్యాయం జరుగుతోందని అన్నారు. అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నామని.. కౌలు డబ్బులు కూడా రాని పరిస్థితి ఉందంటూ ఆవేదన చెందారు. ప్రభుత్వం నుంచి కౌలు రైతులకు సాయం అందేలా చూడాలని పవన్ కళ్యాణ్‌కు రైతులు వినతి చేశారు. రైతుల బాధలు విన్న డిప్యూటీ సీఎం.. వారికి ధైర్యం చెప్పారు. రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని.. ఎవరూ ఆందోళన చెందవద్దని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భరోసా ఇచ్చారు. అలాగే రెండు మూడు రోజుల్లో పంట నష్టం అంచనాలు పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని పవన్‌కు కలెక్టర్ బాలాజీ వివరించారు. కాగా.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, జిల్లా కలెక్టర్ డికె బాలాజీ.. పవన్ కళ్యాణ్‌తో కలిసి పర్యటనలో పాల్గొన్నారు.




## భారీ వర్షాలు.. ఏపీ జలవనరుల శాఖ కీలక ప్రకటన

అమరావతి, అక్టోబర్ 30: మొంథా తుపాను కారణంగా ఎగువన కృష్ణానది పరివాహ ప్రాంతంలో భారీ వర్షాలు నమోదయ్యాయి. ఈ క్రమంలో ఏపీ జలవనరుల అభివృద్ధి శాఖ కీలక ప్రకటన జారీ చేసింది. భారీ వర్షాల వల్ల కృష్ణా ఉపనదులకు ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని పేర్కొంది. కృష్ణా నదికి భారీగా వరద నీరు వచ్చి చేరనుందని.. అలాగే ప్రకాశం బ్యారేజీ వద్ద నేటి ఇన్ఫ్లో ఆరు లక్షలకు చేరుతుందని వెల్లడించింది. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో శాఖాపరమైన రక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు పరిహాహక ప్రాంతంలోని ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఏపీ జలవనరుల అభివృద్ధి శాఖ హెచ్చరించింది. కాగా... మొంథా తుపాను ప్రభావంతో ఏపీ వ్యాప్తంగా పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. తుపాను తీరం దాటిన సమయంలో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. దీంతో అనేక ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవడంతో ప్రాణ నష్టం తప్పింది. తుపాను ప్రభావిత ప్రాంత ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే తుపాను ఎఫెక్ట్‌తో వేలాది ఎకరాల్లో పంట పొలాలు నీటమునిగాయి. వరద నీరు చేరడంతో ప్రాజెక్టులు, నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లడంతో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.




గుంటూరు: మొంథా తుపాను ప్రభావంతో గుంటూరు జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. దీంతో కాకుమాను, పెదనందిపాడు మండలాల్లోని నల్లమడ వాగులో వరద ఉద్ధృతి పెరిగింది. కాకుమాను మండలం కొండపాటూరు సమీపంలో నల్లమడ వాగు కట్టపై నుంచి వరద నీరు పొంగి పొర్లి సమీప పొలాల్లోకి చేరుతోంది. వరద మరింత పెరిగితే కట్టలు తెగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వాగు ఉద్ధృతి మరో మూడు అడుగులు పెరిగితే కాకుమాను మండలం గార్లపాడు వద్ద ప్రమాదం పొంచి ఉంది.




శాంతియుత అణుశక్తికి భారతదేశం అండగా నిలుస్తుందని రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి అన్నారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) నివేదికపై దేశం తరపున ఆమె మాట్లాడారు. అణు విజ్ఞానం, సాంకేతికతను శాంతియుతంగా, సురక్షితంగా వినియోగించుకోవడంలో ఐఏఈఏ పోషిస్తున్న కీలక పాత్రకు భారత్ తరపున మద్దతు ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. అణుశక్తి వల్ల బహుముఖ ప్రయోజనాలున్నాయని చెప్పారు. స్థిరమైన అభివృద్ధి, ప్రజారోగ్యం, వ్యవసాయం, నీటి నిర్వహణ వంటి రంగాల్లో ఇది కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. అణు విద్యుత్ పరిశోధనల్లో భారతదేశం సాధించిన పురోగతి అసాధారణమైందని వివరించారు. భాగస్వామ్య దేశాలతో అణు నైపుణ్యాన్ని పంచుకోవడం ద్వారా ఐఏఈఏకి భారత్ సహకరిస్తోందన్నారు.

## వీఎంసీ పాలకవర్గంపై ప్రభుత్వం సీరియస్.. కారణమిదే




అమరావతి, అక్టోబర్ 30: విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పాలక వర్గానికి రాష్ట్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. విజయవాడలో స్మార్ట్ స్ట్రీట్ మార్కెట్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ కార్పొరేషన్ చేసిన తీర్మానాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరించిన పాలక వర్గంపై సీరియస్ అయ్యింది. విజయవాడ నగర పాలక సంస్థ పాలకవర్గం తీరును రాష్ట్ర ప్రభుత్వం తప్పుబట్టింది. డ్వాక్రాలోని మహిళా చిరు వ్యాపారులకు దుకాణాలు ఏర్పాటు చేయాలన్న ఆదేశాలను పాలకవర్గం పాటించలేదు. స్కీమ్ అమలు చేయలేమని, రూ.1.16 కోట్లు కేటాయించలేమని అక్టోబర్ 8న తీర్మానం చేసింది. వైసీపీ ఛైర్‌పర్సన్ మేయర్ రాయన భాగ్యలక్ష్మి నేతృత్వంలోని పాలకవర్గం ఈ మేరకు తీర్మానం చేసింది. కార్పొరేషన్‌లో వైసీపీకి మెజారిటీ ఉండటంతో ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ తీర్మానం చేస్తున్న పరిస్థితి. అయితే ఈ ఏడాది అక్టోబర్ 8న పంపిన తీర్మానాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలు అమలు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. విజయవాడలోని ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డులో స్మార్ట్ స్ట్రీట్ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని సర్కార్ ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జూలై 30న విడుదల చేసిన జీవో 753 అమలు చేయాలని నిర్దేశించింది. నగర పాలక సంస్థ వాటా నిధులతో మార్కెట్ ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ ఆదేశాలిచ్చారు.

## కృష్ణా, ఉపనదులకు వరద.. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి: మంత్రి నిమ్మల



విజయవాడ: ఎగువన కురిసిన భారీ వర్షాలకు కృష్ణా, ఉపనదులకు భారీ వరద వస్తోందని.. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది వరదను ఇరిగేషన్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.

అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఈరోజు సాయంత్రం ప్రకాశం బ్యారేజికి 6 నుండి 6.5 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. ఈక్రమంలో దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. కృష్ణా డెల్టా పరిధిలో అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ.. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో వాగులు పొంగుతుండటంతో ఆయా జిల్లాల కలెక్టర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గుండ్లకమ్మ నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అధిక వర్షాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు వాగులు, కాలువ గట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

## ఇది మహా విపత్తు కాబట్టి.. ఇలా చేయండి: షర్మిల




విజయవాడ: రాష్ట్రంపై ప్రధాని మోదీ సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నారని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి విమర్శలు గుప్పించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉత్తరాదిన ప్రకృతి విలయాలకు వెంటనే జాతీయ విపత్తులుగా ప్రకటించుకునే ప్రధాని, మొంథా తుఫాన్ ధాటికి జనజీవనం అల్లకల్లోలం అయితే తమకేం పట్టనట్లు చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల మద్దతుతో మూడో సారి గద్దెనెక్కిన మోదీ, ఆపద సమయంలో మొహం చాటేసి మరోసారి తీవ్ర అన్యాయం చేస్తున్నారని అన్నారు.

**జాతీయ విపత్తుగా ప్రకటించాలి...** మొంథా తుఫాన్ రైతన్నకు అపార నష్టాన్ని, తీరని శోకాన్ని మిగిల్చిందని, రాష్ట్రంలో 20 లక్షల ఎకరాలకు పైగా నీట మునిగాయని, ఖరీఫ్ సీజన్‌లో సాగైన పంటల్లో 30 శాతం పనికి రాకుండా పోయాయని, 10 లక్షల మంది రైతు కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. ఇది రాష్ట్ర రైతాంగానికి సంభవించిన మహా విపత్తు అని, రూ. 20వేల కోట్లకు పైగానే రైతులకు అపార నష్టం జరిగిందని వివరించారు. మొంథా తుఫాన్‌ను జాతీయ విపత్తుగా వెంటనే ప్రకటించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ప్రళయం మిగిల్చిన నష్టం అంచనాకు ప్రత్యేక బృందాలను రాష్ట్రానికి పంపాలని కోరారు. అంచనా నివేదికలొచ్చే లోపు రాష్ట్రానికి తక్షణ సహాయం కింద రూ.10 వేల కోట్లు మోదీ ప్రకటించాలన్నారు.

**భావ్యం కాదు...** రాష్ట్రానికి ఇది ఆపద కాలమని.. 20 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగితే.. కేవలం 2.88 లక్షల ఎకరాల్లోనే నష్టం జరిగినట్లు తక్కువ చేయడం భావ్యం కాదన్నారు. ఇది రైతులను మోసం చేయడమేనని అన్నారు. సర్వం కోల్పోయిన వారి సంఖ్య లక్షల్లోనే ఉందని, NDA ప్రభుత్వంలో పెద్దన్న పాత్ర పోషించే చంద్రబాబు .. మోదీ మోసాలపై ఇప్పుడైనా నోరు విప్పాలని షర్మిల డిమాండ్ చేశారు. మొంథా తుఫాన్‌ను జాతీయ విపత్తుగా గుర్తించాలని, జరిగిన నష్టానికి కేంద్రం నుంచి పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం తీసుకురావాలని డిమాండ్ చేశారు. తుఫాను కారణంగా నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని ఆదుకోవాలని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## 'మొంథా'ను ఏపీ ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కొంది: పీవీఎన్ మాధవ్



అనంతపురం: మొంథా తుపానును ఏపీ ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కొందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. తుపాను పరిస్థితులపై ప్రధాని స్వయంగా ఆరా తీశారని చెప్పారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. తుపానుతో రాష్ట్రంలో అపార పంట నష్టం జరిగిందన్నారు. నష్టం అంచనాకు బృందాలు క్షేత్రస్థాయిలోకి వెళ్లాయని చెప్పారు. తుపానుతో నష్టపోయిన వారి జాబితాను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు.

తిరుమలలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై విచారణ జరుగుతోందని మాధవ్ అన్నారు. శ్రీవాణి, పరకామణితో పాటు అనేక అంశాలపై అనుమానాలు ఉన్నాయని చెప్పారు. భవిష్యత్తులో తిరుమలలో ఇలాంటివి జరగకుండా చర్యలు ఉండాలన్నారు.

## మంత్రి నారా లోకేశ్ పేరిట రూ.54 లక్షలు మోసం..




విజయవాడ: మంత్రి నారా లోకేశ్ పేరిట రూ.54 లక్షలు సైబర్ నేరగాళ్లు కాజేశారు. లోకేశ్ ఫొటో ఉపయోగించి సైబర్ నేరాలకు పాల్పడ్డారు. సీఐడీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోషల్ మీడియా వేదికగా సురేంద్ర టీడీపీ ఎన్.ఆర్.ఐ కన్వీనర్ అంటూ మోసాలకు పాల్పడినట్లు తెలిపారు. వాట్సాప్ డీపీ నారా లోకేశ్ ది ఉండటంతో బాధితులు కూడా నిజమని నమ్మినట్టు చెప్పారు. ప్రభుత్వం నుంచి మెడికల్ హెల్ప్ కోసం ఎదురుచూస్తున్న బాధితులను ఈ ముఠా టార్గెట్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. మెడికల్ హెల్ప్ కోసం ఎదురుచూస్తున్న బాధితులకు పది లక్షల రూపాయలు వీత్ డ్రాకి అనుమతి వచ్చింది అంటూ.. ట్యాక్స్‌లు పేరిట బాధితుల వద్ద నుంచి కేటుగాళ్లు డబ్బులు వసూలు చేసినట్లు సీఐడీ పోలీసులు తెలిపారు. 9 మంది బాధితుల నుంచి సుమారు.. రూ.54 లక్షలు కాజేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు విచారణ చేపట్టి రాజేష్, సాయి శ్రీనాథ్, సురేంద్రలను నిందితులుగా గుర్తించి వారిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఈ కేసులో ఏ1గా ఉన్న రాజేష్‌ను గతంలో కూడా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కోర్టు ముగ్గురు నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించినట్లు స్పష్టం చేశారు.

## ముందస్తు చర్యలతో సంగం బ్యారేజీకి ముప్పు తప్పింది: హోం మంత్రి అనిత



విజయవాడ: అధికారుల ముందస్తు చర్యలతో నెల్లూరు జిల్లా సంగం బ్యారేజీకి ముప్పు తప్పిందని హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. సంగం బ్యారేజీకి కొట్టుకువచ్చిన 35 టన్నుల భారీ బోటును ఒడ్డుకు చేర్చడంలో అధికారుల పనితీరు ప్రశంసనీయమన్నారు. బ్యారేజీకి ప్రమాదం సంభవించకుండా కలెక్టర్, అధికారులు వెంటనే స్పందించారని తెలిపారు. సంగం బ్యారేజీ బోటు ప్రమాదానికి గురికాకుండా చర్యలు తీసుకున్నారన్నారు.

**నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం: బీసీ జనార్ధన్‌రెడ్డి...** నంద్యాల జిల్లా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి పర్యటించారు. బనగానపల్లె నియోజకవర్గంలో పర్యటించిన ఆయన.. కోవెలకుంట్ల, సంజామల మండలాల్లో దెబ్బతిన్న పంటను పరిశీలించారు. కోవెలకుంట్ల మండలం స్వామినగర్, బిజినవేములలో కూలిన మట్టి మిద్దెలను పరిశీలించారు. దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి.. పునరుద్ధరణ పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

# 3 నెలల్లో ఇంత లుక్కు ఎలా పాజిబుల్?

తీగ లాంటి లుక్కుతో రాకుమారిలా మారిపోవాలని కోరుకోనిది ఎవరు? అయితే బొద్దుగుమ్మ వామిక గబ్బి సైజ్ జీరో రూపానికి మారేందుకు ఎంతగా శ్రమిస్తోందో తాజాగా కొన్ని వీడియోలు, ఫోటోల రూపంలో రివీల్ చేసింది. వామిక ఇప్పుడు పూర్తి మేకోవర్ తో ఆశ్చర్యపరుస్తోంది. కేవలం మూడు నెలల్లోనే ఇంత మార్పు సాధ్యమైందా? అని అనుమానించేంతగా ఈ కొత్త లుక్కు షాకిస్తోంది. హే వైలీ .. అర్జున్... నువ్వు నన్ను 3 నెలల్లో ఈ స్థితికి తీసుకురావాలి. మనం డిసెంబర్‌లో ప్రారంభిద్దాం... మీ ప్రయాణానికి శుభాకాంక్షలు గురూజీ అని వ్యాఖ్యను జోడించింది. వామిక ఇప్పటికే తాను ఆశించిన మేకోవర్ ని సాధించింది. మునుముందు మరో ఛాలెంజ్ కి రెడీ అవుతోంది.. వామిక ఇటీవల వరుణ్ ధావన్ సినిమాలో నటించింది. ఆ తర్వాత పెద్ద తెర కమిట్ మెంట్లపై సరైన సమాచారం లేదు. వామిక గత కెరీర్ మ్యాటర్ లోకి వెళితే... బాలీవుడ్ క్లాసిక్ జబ్ వి మెట్ లో ఒక చిన్న పాత్రతో బాలనటిగా ప్రయాణాన్ని ప్రారంభించింది. తన



యుక్తవయసులో కథానాయికగా మారిపోయింది. తు మేరా 22 మై తేరా 22, ఇష్క్ బ్రాందీ, లాంటి చిత్రాల్లో నటించింది. నిక్కా జైల్దార్ సిరీస్ విజయంతో పంజాబీ సినీపరిశ్రమలోను గుర్తింపు పొందింది. వామికా గబ్బి చండీగఢ్‌కు చెందిన పంజాబీ కుటుంబానికి చెందిన యువతి. తండ్రి గోవర్ధన్ గబ్బి, గబ్బీ అనే మారుపేరుతో హిందీ - పంజాబీ రెండింటిలోనూ ప్రఖ్యాత రచయిత. చండీగఢ్‌లోని సెయింట్ జేవియర్స్ స్కూల్‌లో తన ప్రారంభ విద్యను పూర్తి చేసింది. చండీగఢ్‌లోని డిఏవీ కళాశాల నుండి ఆర్ట్స్‌లో డిగ్రీని పొందింది. సాహిత్య వాతావరణంలో పెరిగిన వామిక వినోద పరిశ్రమలో సృజనాత్మకంగా రాణించాలని కలలు కంది. ఈ బ్యూటీ రొమాంటిక్ డ్రామా మాలై నెరతు మయక్కంతో తమిళ సినిమాల్లోకి అడుగుపెట్టింది. గోధాతో మలయాళ సినీరంగంలోను ఆరంగేట్రం చేసింది. ఇందులో ఆమె పంజాబీ రెజ్లర్‌గా నటించింది. గోధాలో వామిక నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. హిందీ వెబ్ సిరీస్ గ్రహణ్, మై: ఎ మదర్స్ రేజ్, మోడరన్ లవ్: ముంబై లాంటి సిరీస్ లతో వామిక గబ్బి అందరి దృష్టిని ఆకర్షించింది. వామికకు సోషల్ మీడియాల్లో భారీ ఫాలోయింగ్ ఉంది.

# శ్రుతిహాసన్ ఇంట్లో పూజలు పునస్కారాలు ఉండవా?

శ్రుతి హాసన్ కెరీర్ దేదీప్య మానంగా సాగిపోతున్న సంగతి తెలిసిందే. తెలుగు, తమిళ, హిందీ సినిమాలతో బిజీ బిజీగా ఉంది. విజయాల పరంగా వెనుకబడినా అవకాశాల పరంగా కొదలేదు. ఏదో పరిశ్రమలో సినిమాలు చేస్తోంది. వాల్తేరు వీరయ్యతో మాస్ హిట్ అందుకోగా అటుపై సలార్ మరో విజయం ఖాతాలో వేసుకుంది. ఇతర భాషల్లో కొన్ని సినిమాలు రిలీజ్ అయ్యాయి. ఇటీవలేకూలీతో అలరించింది. తాజాగా ఈ బ్యూటీ బాలీవుడ్-సౌత్ ఇండస్ట్రీ మధ్య వ్యత్యాసం చెప్పే ప్రయత్నం చేసింది. సౌత్ పరిశ్రమలో తారలు ఎంతో వినయంతో ఉంటారంది. ఇక్కడ సంస్కృతి సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇస్తారు. సినిమా ప్రారంభోత్సవం రోజున దేవుడి పటాల ముందు కొబ్బరి కాయలు కొట్టడం..దేవుళ్లకు నమస్కరించడం.. మనసులో కోరికలు కోరుకోవడం.. పూజలు చేయడం వంటివి కనిపిస్తాయి. సౌత్ లో అన్ని పరిశ్రమల్లో ఇలా కనిపిస్తుంది. పరిశ్రమలోకి అడుగు పెట్టిన కొత్తలో నాకు ఇదంతా చాలా కొత్తగా



అనిపించేదంది. ఎందుకంటే మా ఇంట్లో అలా చేయడం ఎప్పుడూ చూడలేదు. ఆచారాలను మా ఇంట్లో వారు ఎవరు నమ్మరు. పూజలు..పునస్కారాలు పెద్దగా ఉండవు. కానీ ప్రతీ విషయంలోనూ క్రమ శిక్షణ ఉంటుందంది. సౌత్ లో ఉన్నట్లు ఈ రకమైన కల్చర్ బాలీవుడ్ లో పెద్దగా కనిపించదన్నారు. చాలా తక్కువ మంది మాత్రమే చేస్తారని, హిందీ సినిమాలు చేస్తున్నప్పుడే ఈ రెండు పరిశ్రమల మధ్య వ్యత్యసం తెలిసిందన్నారు. సౌత్ లో బాగా డబ్బు సంపాదించిన వారు కూడా చాలా పద్దతులు పాటిస్తుంటారు. వారు ఇప్పటికీ అదే పాత పద్దతి కొనసాగించడం చూస్తుంటే వీరు ఇంకా పాత అంబాసిడర్ కారులోనే ప్రయాణిస్తున్నారా? అనిపిస్తుందన్నారు. ఆడంబరమైన వస్తువులతో తమ విజయాన్ని నిరూపించుకోవాలనుకోరంది. కమల్ హాసన్ కూడా ఆచారాలు పాటించరు. దేవుళ్లు..దెయ్యాలు గురించి టాపిక్ ను ఆయన టచ్ చేయరు. పలు సందర్భాల్లో ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా వివాదాస్పదమయ్యాయి. ఈ నేపథ్యంలో క్షమాపణలు చెప్పాలనే డిమాండ్ వ్యక్తమైనా? కమల్ మాత్రం ఎక్కడా తగ్గలేదు. తాను నమ్మిన సిద్దాంతానికే కట్టుబడి ఉంటారు.కమల్ లాగే తనయ శ్రుతి హాసన్ కూడా ఉంటుందని ఆమె మాటల్ని బట్టి తెలుస్తోంది.




# మొదట్లో ఐరన్ లెగ్.. కట్ చేస్తే స్టార్ హీరోయిన్స్.. ఎవరంటే?



సినిమా ఇండస్ట్రీలోకి రావడానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. హీరోయిన్లు మాత్రమే కాదు హీరోలు కూడా చాలా ఇబ్బందులు పడతారు. అయితే హీరోయిన్లు ఇండస్ట్రీలో స్టార్స్ గా రాణించాలి అంటే కమిట్మెంట్లు, క్యాస్టింగ్ కౌచ్ లు ఇలా ఎన్నో ఉంటాయి. ఇవన్నీ దాటుకొని ఇండస్ట్రీలో రాణిస్తేనే ముందుకు వెళ్తారు. అయితే సినిమాల్లోకి వచ్చిన మొదట్లోనే అందరికీ హిట్స్ పడిపోవు. ఎన్నో ఫ్లాప్ సినిమాలను, అవమానాలు ఎదుర్కొన్నాకే హిట్ సినిమాలు పడతాయి. అలా కొత్త హీరోయిన్ ఇండస్ట్రీకి వచ్చి రెండు మూడు సినిమాలు హిట్ కొడితే ఓకే.. లేకపోతే మాత్రం ఐరన్ లెగ్ అనే ముద్ర వేస్తారు. అలా ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో ఐరెన్ లెగ్ ముద్ర వేసుకొని ఆ తర్వాత సినిమాల్లో స్టార్ హీరోయిన్స్ గా రాణించిన వాళ్లు ఎంతోమంది ఉన్నారు. వారెవరో ఇప్పుడు చూద్దాం..

**విద్యాబాలన్:** బాలీవుడ్ బోల్డ్ బ్యూటీ విద్యాబాలన్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. అయితే ఈ హీరోయిన్ సినిమాల్లోకి వచ్చిన కొత్తలో ఐరన్ లెగ్ అనే ముద్ర వేసుకుంది. దానికి కారణం మోహన్ లాల్ తో ఆగిపోయిన చక్రం మూవీ..ఈ సినిమా డైరెక్టర్ కి - హీరో కి మధ్య గొడవలు రావడంతో ఆగిపోయింది. ఈ సినిమాలో హీరోయిన్ గా తీసుకున్న విద్యాబాలన్ కి బిగ్ షాక్ తగిలింది. ఎందుకంటే మోహన్ లాల్ తో సినిమా అనగానే విద్యాబాలన్ కి దాదాపు 8,9 సినిమాల్లో ఆఫర్స్ వచ్చాయి.కానీ ఎప్పుడైతే చక్రం మూవీ ఆగిపోయిందని తెలిసిందో ఆ తర్వాత రాత్రికి రాత్రే ఏకంగా 8,9 సినిమాల నుండి విద్యాబాలన్ ని తీసేసారట. దాంతో విద్యాబాలన్ పై ఐరన్ లెగ్ ట్యాగ్ వేశారు. కానీ ఆ తర్వాత డర్టీ పిక్చర్ అనే మూవీ తో విద్యాబాలన్ ఇండస్ట్రీని షేక్ చేసింది.

**రమ్యకృష్ణ:** సౌత్ స్టార్ హీరోయిన్ రమ్యకృష్ణ కూడా సినిమాల్లోకి వచ్చిన కొత్తలో ఐరన్ లెగ్ ముద్ర వేసుకుంది. ఈ ముద్దుగుమ్మ మొదట తమిళ సినిమా ద్వారా సినిమాల్లోకి వచ్చింది. ఆ తర్వాత తెలుగులో భలే మిత్రులు మూవీతో ఎంట్రీ ఇచ్చింది. అయితే 1984లో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన రమ్యకృష్ణకి దాదాపు ఏడు సంవత్సరాలు గడ్డుకాలం నడిచిందట. ఆమె చేసిన సినిమాలన్నీ ఫ్లాప్ అవ్వడంతో ఐరన్ లెగ్ అనే ట్యాగ్ ని తగిలించారు. కానీ విశ్వనాథ శాస్త్రి దర్శకత్వంలో వచ్చిన సూత్రధారులు సినిమా రమ్యకృష్ణ కెరియర్ ని మార్చేసింది. ఈ సినిమాతో ఆమెకు వరుస సినిమాల్లో ఆఫర్స్ వచ్చాయి. అలా సినిమాల్లోకి వచ్చాక దాదాపు 7 సంవత్సరాలు ఐరన్ లెగ్ అనే ముద్రతోనే రమ్యకృష్ణ ఇండస్ట్రీలో రాణించింది. ఆ తర్వాత ఈమెకు తెలుగు, తమిళ భాషల్లో బ్రహ్మరథం పట్టారు.

**నయనతార:** ఈ హీరోయిన్ మలయాళ సినిమాలతో ఇండస్ట్రీలోకి వచ్చినప్పటికీ ఆ సినిమాలు ఏవి అంత గుర్తింపు తెచ్చిపెట్టలేదు. కానీ తెలుగు, తమిళ భాషలో విడుదలైన చంద్రముఖి సినిమా నయనతారకి మంచి క్రేజ్ తెచ్చింది.ఆ తర్వాత వచ్చిన గజిని కూడా నయన్ కెరీర్ ని మార్చేసింది.అలా తెలుగు, తమిళ భాషల్లో ఇప్పడికి స్టార్ హీరోయిన్ గా రాణించింది.

**శృతిహాసన్ :** కమల్ హాసన్ కూతురు అయినప్పటికీ శృతిహాసన్ కి వరుస డిజాస్టర్స్ తప్పలేదు. అలా ఇండస్ట్రీ లోకి వచ్చిన కొత్తలో లక్, అనగనగా ఓ ధీరుడు, 3, ఓ మై ఫ్రెండ్,7 ఓం అరివు వంటి వరుస సినిమాలు ఫ్లాప్స్ అయ్యాయి. కానీ ఎప్పుడైతే పవన్ కళ్యాణ్ తో గబ్బర్ సింగ్ మూవీలో చేసిందో. ఆ తర్వాత ఈమె దశ తిరిగిపోయింది. ఈ మూవీతో ఐరన్ లెగ్ హీరోయిన్ కాస్తా స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. ఇక ఈ మధ్యకాలంలో శృతిహాసన్ ఫ్లాపుల్లో ఉన్న హీరోలకు గోల్డెన్ హీరోయిన్ గా మారిపోయింది.

# కొత్త సంవత్సరంలో డెకాయిట్.. రిలీజ్ ఎప్పుడంటే?




టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్.. ఇప్పుడు పలు సినిమాలతో బిజీగా ఉండగా.. అందులో ఒకటి డెకాయిట్. విభిన్నమైన కథలతో ఇప్పటికే ఆడియన్స్ ను మెప్పించి సూపర్ హిట్లు అందుకున్న అడివి శేష్.. ఇప్పుడు డెకాయిట్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. పూర్తి యాక్షన్ డ్రామాగా ఆ సినిమా రెడీ అవుతోంది. అడివి శేష్ హీరోగా ఇప్పటికే నటించిన క్షణం, గూఢచారి చిత్రాలకు సినిమాటోగ్రఫర్ గా వర్క్ చేసిన షనీల్ డియో.. ఇప్పుడు డెకాయిట్ కు దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాతోనే ఆయన డైరెక్టర్ గా పరిచయమవుతున్నారు. హీరోయిన్ గా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. ముందు ఫిమేల్ లీడ్ రోల్ కు శ్రుతి హాసన్ అనుకున్నా.. ఆమె తప్పుకున్నారు. అయితే డెకాయిట్ మూవీ 2025 క్రిస్మస్ కానుకగా డిసెంబరు 25న రిలీజ్ చేస్తున్నట్టు మేకర్స్ కొన్ని రోజుల క్రితం అనౌన్స్ చేశారు. అందుకు తగ్గట్టే షూటింగ్ షెడ్యూల్ ను కూడా ప్లాన్ చేశారు. జెట్ స్పీడ్ లో చిత్రీకరణ నిర్వహించాలని అనుకున్నారు. కానీ డెకాయిట్ షూటింగ్ లోనే అడవి శేష్ ఇటీవల గాయపడడంతో చిత్రీకరణ వాయిదా పడింది. ఇంకా సినిమాకు సంబంధించిన కీలక సీన్స్ ను షూట్ చేయాల్సి ఉంది. అయితే అడివి శేష్ ఇప్పుడు గాయం నుండి కోలుకున్నా.. ప్రస్తుతం వైద్యుల సలహాతో విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో షూటింగ్ మళ్లీ ప్రారంభమవ్వడానికి కాస్త సమయం పడుతుంది. దీంతో మేకర్స్ సినిమా రిలీజ్ ను వాయిదా వేశారు. క్రిస్మస్ కు విడుదల చేయడం లేదు. తాజాగా సినిమా కొత్త రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేశారు. వచ్చే ఏడాది ఉగాది పండుగ కానుకగా మార్చి 19న రిలీజ్ చేస్తున్నామని అఫీషియల్ గా మంగళవారం ఉదయం ప్రకటించారు మేకర్స్. ఆ సమయంలో స్పెషల్ పోస్టర్ కూడా రిలీజ్ చేశారు.

అందులో అడివి శేష్, మృణాల్ ఠాకూర్ యాక్షన్ మోడ్ లో కనిపించారు. ఓ యాక్షన్ సీన్స్ కు సంబంధించిన పిక్ గా తెలుస్తోంది. కొత్త పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఇక సినిమా విషయానికొస్తే.. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. బాలీవుడ్ ఫిల్మ్ మేకర్, యాక్టర్ అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. తెలుగులో డెకాయిట్ తోనే ఆయన అరంగేట్రం చేస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. మరి కొత్త సంవత్సరంలో రానున్న డెకాయిట్ ఎలా మెప్పిస్తుందో చూడాలి.

# గార్జియస్ లుక్ లో అమృత!

అమృత అయ్యర్.. ఈ పేరు గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. తెలుగులో చేసింది తక్కువ సినిమాలే అయినా తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. ముఖ్యంగా ప్రముఖ యాంకర్ ప్రదీప్ మాచిరాజుతో కలిసి '30 రోజుల్లో ప్రేమించడం ఎలా?' అనే సినిమాతో ఓవర్ నైట్ లోనే లైమ్ లైట్ లోకి వచ్చేసింది. ఆ తర్వాత ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో యంగ్ హీరో తేజ సజ్జ నటించిన హనుమాన్ సినిమాలో హీరోయిన్గా నటించి మరోసారి ప్రేక్షకులను అబ్బురపరిచింది. ఈ సినిమాలో ఈమె నటనకు విమర్శకుల ప్రశంసలు కూడా లభించాయి. అంతేకాదు ఈ సినిమా తర్వాత ఆఫర్లు వరుసగా తలుపు తడతాయని అందరూ అనుకున్నారు. కానీ అనుకున్నంత స్థాయిలో అవకాశాలు అయితే రాలేదు. ఇక బచ్చల మిల్లి సినిమాలో అల్లరి నరేష్ సరసన హీరోయిన్గా నటించినా కానీ ఈ సినిమా కూడా ఈమెకు కలిసి రాలేదని చెప్పాలి. ఇకపోతే అటు సినిమాలకు ఇటు సోషల్ మీడియాకి కూడా కాస్త దూరంగా ఉన్న ఈమె తాజాగా తన స్నేహితులతో కలిసి సరదాగా గడిపిన క్షణాలను ఇంస్టాగ్రామ్ వేదికగా షేర్ చేసుకుంది..ఆ ఫోటోలలో



చాలా గార్జియస్ లుక్ లో కనిపించి అందరి దృష్టిని ఆకట్టుకుంది అమృత అయ్యర్. తాజాగా స్లీవ్ లెస్ ముదురు నీలం రంగు దుస్తులు ధరించిన ఈమె.. ఆ దుస్తులలో తన ఆత్మవిశ్వాసాన్ని రేకెత్తించింది. బోల్డ్ స్లిట్ తో కప్పబడిన స్కర్ట్ ఆమెకు క్లాసీ లుక్కును అందించింది. ఈ గ్లామర్ లుక్కులో చాలా రిలాక్స్ గా కనిపించి సరికొత్త వైబ్ క్రియేట్ చేసింది అమృత అయ్యర్. ప్రస్తుతం ఈమె షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి చాలా రోజుల తర్వాత ఇలాంటి లుక్కులో చూసేసరికి అభిమానులు ఈ ఫోటోలను తెగ లైక్, షేర్ చేస్తున్నారు. అమృత అయ్యర్ విషయానికి వస్తే.. 1994 మే 14న తమిళనాడులోని చెన్నైలో తమిళ్ మాట్లాడే కుటుంబంలో జన్మించింది. కర్ణాటకలోని బెంగళూరులో పెరిగిన ఈమె అక్కడే ఎన్ హెచ్ ఆర్ పాఠశాలలో స్కూల్ విద్యాభ్యాసం పూర్తి చేసి, సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ లో డిగ్రీ పూర్తి చేసింది. 2018లో తమిళ చిత్రం పడైవీరన్ సినిమాతో తొలిసారి హీరోయిన్ గా అడుగుపెట్టిన ఈమె ఆ తర్వాత బిగిల్, లిఫ్ట్ వంటి చిత్రాలు చేసి ప్రేక్షకులను మెప్పించింది.. రెడ్ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈమె.. ఆ తర్వాత 30 రోజుల్లో ప్రేమించడం ఎలా అనే సినిమా చేసి ఆకట్టుకుంది. హనుమాన్ సినిమాతో వంద కోట్ల క్లబ్లో చేరిన ఈమె బచ్చల మిల్లి , అర్జున ఫాల్గుణ సినిమాలు చేసింది..

# ఒకేసారి ముగ్గురు సూపర్ స్టార్స్‌తో మమిత..!

'ప్రేమలు' సినిమాతో ఓవర్ నైట్‌లో స్టార్ హీరోయిన్‌గా మారిన ముద్దుగుమ్మ మమిత బైజు. అంతకు ముందు వరకు మలయాళ సినిమాలకు పరిమితం అయిన మమిత బైజు ఇప్పుడు వరుస తమిళ సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది. టాలీవుడ్ నుంచి కూడా ఈ అమ్మడికి ఆఫర్లు తలుపు తడుతున్నాయని తెలుస్తోంది. ఇటీవలే తమిళ మూవీ డ్యూడ్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటించిన డ్యూడ్ సినిమా రూ. 100 కోట్లకు మించి వసూళ్లు నమోదు చేసిన నేపథ్యంలో మమిత మరింత బిజీగా కోలీవుడ్‌లో మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలుగులోనూ డ్యూడ్‌కి మంచి రెస్పాన్స్ దక్కింది. అందుకే తెలుగు ఫిల్మ్ మేకర్స్ నుంచి ఈమెకు ఆఫర్లు తలుపు తడుతున్నాయని తెలుస్తోంది. మొత్తానికి మమిత బైజు ఒకే ఏడాది వరుసగా పెద్ద హీరోల సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది.

**విజయ్ జన నాయగన్ సినిమాలో మమిత బైజు...** ఇప్పటికే తమిళ్



సూపర్ స్టార్ విజయ్ హీరోగా నటిస్తున్న జన నాయగన్ సినిమాలో మమిత ముఖ్య పాత్రలో కనిపించబోతుంది. ఆ సినిమాలో హీరోయిన్ రోల్ కానప్పటికీ చాలా కీలకమైన పాత్ర అంటూ సమాచారం అందుతోంది. ఆ సినిమా మమిత కెరీర్ గ్రాఫ్ ను మరింతగా పెంచుతుందనే విశ్వాసంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు తమిళ మరో సూపర్ స్టార్ సూర్య హీరోగా రూపొందుతున్న సినిమాలోనూ మమిత బైజు నటిస్తోంది. సూర్యకు జోడీగా నటిస్తున్న నేపథ్యంలో ఆ సినిమాపై మమిత చాలా ఆశలు పెట్టుకుంది. ఈ రెండు సినిమాలు వచ్చే ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నా యి. ఈ రెండు సినిమాలు కాకుండా మమిత బైజు మరో కొత్త సినిమాలోనూ మమిత నటించేందుకు రెడీ అయింది. అది కూడా తమిళ సూపర్ స్టార్ మూవీ కావడంతో ఒకే సారి ముగ్గురు స్టార్స్ తో నటించే అవకాశం దక్కించుకున్న అరుదైన రికార్డ్‌ను సొంతం చేసుకుంది.

**ధనుష్ హీరోగా మమిత బైజు హీరోయిన్‌గా...** తమిళ సూపర్ స్టార్ ధనుష్ నటించబోతున్న D54 సినిమాలో మమిత బైజు హీరోయిన్‌గా ఎంపిక అయింది. అధికారికంగా బయటకు రానప్పటికీ కోలీవుడ్ వర్గాల్లో ఈ విషయమై ప్రముఖంగా చర్చ జరుగుతోంది. కోలీవుడ్ లో ఒకే ఏడాది అంటే 2026 లో ముగ్గురు సూపర్ స్టార్స్‌తో నటించిన సినిమాలతో మమిత బైజు బ్యాక్ టు బ్యాక్ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



## జలదిగ్బంధంలో ఏడుపాయల వనదుర్గామాత ఆలయం

**మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం మళ్లీ జలదిగ్బంధంలో చిక్కుకుంది. మొంథా తుపాను ధాటికి ఎగువన కురుస్తున్న వర్షాలకు మంజీరా నదికి వరద పెరిగింది. దీంతో గర్భగుడి ఎదుట ఉన్న నదిపాయ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా ఆలయాన్ని మూసివేశారు. రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి భక్తులకు దర్శనాన్ని కల్పిస్తున్నారు.**



## జలదిగ్బంధంలో వరంగల్

వరంగల్: మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వరంగల్‌లోని పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రధానంగా వరంగల్ నగరంతో పాటు హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లోని పలు కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. వరంగల్–హనుమకొండను అనుసంధానం చేసే హంటర్ రోడ్డులో బొంది వాగు ఉప్పొంగడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

**భద్రకాళి ఆలయానికి రాకపోకలు బంద్...** ములుగు రోడ్డు వద్ద నాలా ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. సంతోషిమాత కాలనీ, డీకే నగర్, ఎన్ఎన్ నగర్, మైసయ్య నగర్, సమ్మయ్య నగర్, సాయి గణేశ్ కాలనీలోని ఇళ్లల్లోకి వరదనీరు చేరుకోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వరద ప్రభావంతో వరంగల్ భద్రకాళి ఆలయానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఆలయం నుంచి పాలిటెక్నిక్ కళాశాల వరకు రోడ్డు జలమయమైంది. వరంగల్ తూర్పు పరిధిలో ఆరు పునరావాస కేంద్రాలను నగరపాలక సంస్థ అధికారులు ఏర్పాటుచేశారు. ముంపు ప్రాంతాల ప్రజలను పడవల సహాయంతో పునరావాస కేంద్రాలకు విపత్తు నిర్వహణ సిబ్బంది తరలించారు.

**కొట్టుకుపోయిన కార్లు, బైక్‌లు...** హనుమకొండ పరిధిలోని వడ్డేపల్లి చెరువు నుంచి భారీగా వరద నీరు కాలనీల్లోకి వచ్చి చేరుతోంది. దీంతో జవహర్ కాలనీ, గోపాల్‌పూర్, 100 ఫీట్ల రోడ్డు జలమయమయ్యాయి. కాజీపేట నుంచి హనుమకొండ మార్గంలోని సోమిడి, గోపాల్‌పూర్ చెరువులు నిండిపోవడంతో కట్టలు తెగిపోయాయి. భారీగా వరద నీరు రోడ్డు పైకి చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వివేక్ నగర్, అమరావతి నగర్, ప్రగతి నగర్ కాలనీలు జలమయమయ్యాయి. పలు కాలనీల్లో కార్లు, బైక్‌లు జల ప్రవాహంలో కొట్టుకుపోతున్నాయి. పోచమ్మ మైదాన్–దేశాయిపేటకు వెళ్లే మార్గంలో 80 ఫీట్ రోడ్డు కూడలి వద్ద ప్రమాదకరంగా గుంత ఏర్పడింది.

## మంత్రివర్గ విస్తరణకు అనుమతి ఇవ్వొద్దు.. సీఈవోకు భాజపా నేతల ఫిర్యాదు



హైదరాబాద్: తెలంగాణ భాజపా నేతలు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) సుదర్శన్‌రెడ్డిని కలిశారు. మంత్రివర్గ విస్తరణకు అనుమతి ఇవ్వొద్దని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తోందని అందులో పేర్కొన్నారు. ఓ వర్గం ఓట్ల కోసమే ఇప్పుడు మంత్రివర్గ విస్తరణ చేపట్టారని విమర్శించారు. అజారుద్దీన్ గతంలో జూబ్లీహిల్స్‌లో పోటీ చేశారని భాజపా నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రివర్గ విస్తరణను ఆపాలని సీఈవోను కోరారు. మంత్రివర్గంలోకి అజారుద్దీన్‌ను తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల నిర్ణయించారు. ఈ నెల 31న విస్తరణకు అవకాశం ఉందని, అజారుద్దీన్‌కు ఏఐసీసీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. కొందరు మంత్రుల శాఖల్లో మార్పులు జరగవచ్చని కూడా తెలుస్తోంది. ఈక్రమంలో సీఈవోను భాజపా నేతలు కలిసి ఫిర్యాదు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.



## తెలంగాణ ప్రాజెక్టులకు పోటెత్తుతోన్న వరద

తెలంగాణలోని అన్ని ప్రాజెక్టులకు వరద ప్రవాహం పోటెత్తుతోంది. నిజాంసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో 3 గేట్లు ఎత్తివేశారు. ప్రాజెక్టు ఇన్ ఫ్లో 20 వేల క్యూసెక్కులుగా ఉండగా, ఔట్ ఫ్లో కూడా 20 వేల క్యూసెక్కులు ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1405 అడుగులు కాగా, ప్రస్తుతం 1405 అడుగులుకు చేరిపోయింది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 17 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 17 టిఎంసిల నీరు ప్రాజెక్టులో ఉంది. దీంతో మూడు గేట్లు ఎత్తివేసి నీటిని దిగువకు వదులుతున్నారు. కాగా, నిజాంసాగర్ ప్రాజెక్టు కామారెడ్డి జిల్లా, నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట గ్రామం వద్ద మంజీరా నదిపై నిర్మించిన సంగతి తెలిసిందే. అటు, శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోకి సైతం భారీగా వరద పోటెత్తుతోంది. ఈ ప్రాజెక్టు ఇన్ ఫ్లో 1,09,654 క్యూసెక్కులు ఉండటంతో, 32 గేట్ల ఎత్తివేసి నీటిని కిందికి వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు ఔట్ ఫ్లో 1,09,654 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు ప్రస్తుత నీటి మట్టం 1091 అడుగులు, 80.5 టీఎంసీలు గా కొనసాగుతోంది. గోదావరి నదిపై నిజామాబాదు జిల్లా బాల్కొండ మండలములో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఉంది. దీని పూర్వపు పేరు పోచంపాడు ప్రాజెక్టు. గోదావరి నదిపై తెలంగాణలో ఇది మొట్టమొదటి ప్రాజెక్టు. మహారాష్ట్రలోని జైక్వాడి ప్రాజెక్టు తరువాత గోదావరి నదిపై దీనిని నిర్మించారు. ఇది.. రామగుండం థర్మల్ విద్యుత్ కేంద్రానికి నీరు సరఫరా చేసే ప్రాజెక్టు. తుఫాన్ నేపథ్యంలో భారీగా కురిసిన వర్షాలకు సింగూరు ప్రాజెక్టుకు కూడా వరద ప్రవాహం ఎక్కువగా ఉంది. ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో ఒక గేటు ఎత్తి అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుత ఇన్ ఫ్లో– 13388 క్యూసెక్కులుగా ఉంటే, ఔట్ ఫ్లో– 9581 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి నిల్వ– 17.133 టీఎంసీలు ఉంటే, దీని పూర్తి స్థాయి నీటి సామర్థ్యం– 29.917 టీఎంసీలు. సింగూరు డ్యాం తెలంగాణలోని సంగారెడ్డి పట్టణానికి సమీపంలోని సింగూరు గ్రామంలో ఉంది. ఇది నీటిపారుదల, జలవిద్యుత్, తాగునీటి ప్రాజెక్ట్ గా సేవలందిస్తోంది. హైదరాబాద్ నగరానికి త్రాగునీరు సింగూర్ డ్యాం నుండే వెళ్తుంది. సింగూర్ డ్యాం మంజీరా నదిపై నిర్మించారు.



## పెనుగంచిప్రోలులో 'మున్నేరు' ఉగ్రరూపం



## ఖమ్మం నగరాన్ని ముంచెత్తిన మున్నేరు

### ఖమ్మంలో భారీవర్షాలు.. కాలనీలను చుట్టుముట్టిన 'మున్నేరు' వరద

ఖమ్మం: మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఖమ్మంలోని 'మున్నేరు' పరివాహకంలోని కాలనీలను వరద చుట్టుముట్టింది. మోతీనగర్, బొక్కలగడ్డ కాలనీల్లోకి వరద చేరింది. మోతీనగర్‌లోని 35, బొక్కలగడ్డలో 57 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు.

**ఖమ్మం–బోనకల్ మార్గంలో నిలిచిన రాకపోకలు...** మున్నేరుకు భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం నీటిమట్టం 24.7 అడుగులకు చేరింది. ఎగువన భారీ వర్షాలతో వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది. మున్నేరు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో వరద నీరు ఖమ్మం–బోనకల్ ప్రధాన రహదారిపై చేరింది. ఖమ్మం నగరం సమీపంలోని దంసలాపురం వద్ద ఆర్అండ్‌బీ రహదారిపై మూడు అడుగుల మేర వచ్చింది. దీంతో పోలీసులు ఆ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. చింతకాని మండలం రామకృష్ణాపురం సమీపంలో లో లెవెల్ వంతెనపై వరద ప్రవహిస్తోంది. పాలేరు జలాశయానికి భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.

ఖమ్మంలోని రాపర్తి నగర్ బీసీ కాలనీ వద్ద డంపింగ్ యార్డుకు వెళ్లే రహదారి కొట్టుకుపోయింది.

టీఎన్జీవోస్ కాలనీని నలువైపులా వరద నీరు ముంచెత్తడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్నేరు పరివాహక ప్రాంతంలోని ఏదులాపురం పరిధిలో కేబీఆర్ నగర్, ప్రియదర్శిని కళాశాల ప్రాంతంలో ఉన్న ఇళ్ల చుట్టూ వరద నీరు చేరింది.



## వరంగల్‌లో వరద బాధితులకు డ్రోన్ల ద్వారా ఆహార పంపిణీ

**వరంగల్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి కొండా సురేఖ పర్యటించారు. జలదిగ్బంధంలో చిక్కుకున్న బీఆర్‌నగర్‌లో సహాయక చర్యలను ఆమె పరిశీలించారు. వరద బాధితులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. మరోవైపు ముంపు ప్రాంతాల్లో ప్రజలకు అధికారులు.. డ్రోన్ల ద్వారా ఆహారం, మంచి నీరు, నిత్యావసర వస్తువులు పంపిస్తున్నారు. మంత్రి సురేఖతో పాటు ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ సత్య శారద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు.**



## నీటమునిగిన పంట పొలాలు..

కరీంనగర్: మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. హుజురాబాద్, శంకరపట్నం, సైదాపూర్ మండలాల్లో వందలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేశవపట్నం వాగు ఉప్పొంగడంతో ఐకేపీ కేంద్రం గోడ కూలి నిల్వ ఉంచిన వరి ధాన్యం కొట్టుకుపోయినట్లు రైతులు తెలిపారు. వాగు ఉప్పొంగడంతో.. సైదాపూర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. హుజురాబాద్‌లో కూడా చిలుకవాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో.. జూపాక రోడ్డు తెగి పోయింది. భారీ వర్షం కారణంగా రోడ్డుపై ఆరబెట్టిన వడ్లు కూడా కొట్టుకుపోయినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే.. సిద్దిపేట జిల్లా చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూల్మిట్ట మండలల్లో వరి పంటకు అపార నష్టం వాటిల్లింది. చేర్యాల మండలంలో.. భారీగా వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ముస్త్యాల వద్ద రాగికుంట పొంగిపొర్లడంతో చేర్యాల – హుస్నాబాద్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షం కారణంగా.. భారీగా ధాన్యం తడిసినట్లు రైతులు తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మద్దూర్‌లో 22 సెం.మీ, దూల్మిట్ట 19 సెం.మీ, చేర్యాల 17సెం.మీ, కొమురవెల్లి 12సెం.మీల వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు. మొంథా తుఫాన్ కారణంగా.. తెలంగాణలోని పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షం బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిశాయి. వర్షాల కారణంగా భారీగా పంట నష్టం వాటిల్లింది. కుండపోత వర్షాలకు వరంగల్ – ఖమ్మం ప్రధాన రహదారిపై భారీగా వరదనీరు చేరింది. దీంతో ఆ రూట్‌ని పోలీసులు తాత్కాలికంగా మూసివేశారు. తుఫాన్ ప్రభావంతో వరంగల్, హనుమకొండ తడిసి ముద్దయింది.

ఈ మేరకు జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ప్రజలు బయటకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే చాలా జిల్లాల్లో వరి ధాన్యం, మొక్క జొన్న పంటలు, చేతి కొచ్చిన పత్తి పంట తడిసి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

## నోడౌట్.. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ విజయం ఖాయం : కొప్పుల

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా ప్రచారం చేసేందుకు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే తెలంగాణ అన్ని విధాలా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో ప్రజలు బీఆర్ఎసకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా మైనార్టీలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించడంతో ప్రజలు కాంగ్రెస్?పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని ఈ ఉప ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధిని ప్రజలు మరిచిపోరని అన్నారు. షేక్‌పేటలో త్వరలో జరిగే కేటీఆర్ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషిచేయాలని అన్నారు. ఈ సందర్భంగా ముఠా జైసింహ కొప్పుల ఈశ్వర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు బింగి నవీన్, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, సోషల్‌మీడియా ఇన్‌చార్జి ప్రవీణ్, సాయి పాల్గొన్నారు.

**తెలంగాణలోని వరంగల్, ఖమ్మం జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు మున్నేరుకు వరద పోటెత్తింది. ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు వద్ద మున్నేరు నది ఉగ్రరూపం దాల్చింది. కాజ్ వే పై నుంచి వరద ప్రవహిస్తోంది. పోలీసులు, రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. వాహనాల రాకపోకలు నిలిపివేశారు. వరద ఉద్ధృతికి పెనుగంచిప్రోలు పరిసర ప్రాంతాల్లో పలు ఆలయాలు నీట మునిగాయి. వత్సవాయి మండలం పోలంపల్లి వద్ద మున్నేరు ఆనకట్ట నుంచి 1,05,000 క్యూసెక్కుల వరద వస్తోంది. లింగాల కాజ్ వేపై వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి.**

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com